

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శనివారం | 11 నవంబర్ 2023 | www.navatelangana.com



సీపీఐ(ఎం) త్యాగాల చరిత్రకు ఓట్లు వేయండి

- డబ్బు సంచులు, అవకాశవాదులను ఓడించండి
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- వైరా సీపీఐ(ఎం) అభ్యర్థిగా భూక్యా వీరభద్రం నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-వైరాటౌన్

అవకాశవాద రాజకీయాలు చేస్తున్న అభ్యర్థులను ఓడించి ఎన్నో త్యాగాలు చేసి ప్రజా పోరాటాలు చేస్తున్న భుక్యా వీరభద్రంను గెలిపించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. శుక్రవారం వైరా పట్టణంలో సిపిఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్ సభను జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ శాసనసభలో కమ్యూనిస్టులు లేని లోపం స్పష్టంగా కనిపిస్తుందని, కమ్యూనిస్టులను బలహీన పరిచి అడ్డు అదుపు లేకుండా దోపిడీ చేయాలని బూర్జువా పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని, వారి డబ్బు మదం, అవకాశవాద రాజకీయాలను ఓడించాలని, ప్రజలు చారిత్రక నిర్ణయం తీసుకొని సిపిఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిగతా పార్టీల అభ్యర్థులు ఇవాళ ఏ పార్టీలో ఉన్నారో, రేపు ఏ పార్టీలో ఉంటారో కూడా వారే చెప్పలేని పరిస్థితి ఉందని, ప్రజలను దోపిడీ చేసి సంపాదించిన డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసే వాళ్లను ఓడించాలని పిలుపునిచ్చారు. సాగునీరు, పోడు పట్టాలు, గిరిజనుల హక్కులు సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేస్తూ వైరా ప్రజల కోసం జైలు జీవితం గడిపిన ఘన చరిత్ర భూక్యా వీరభద్రంకు ఉందని, కార్పొరేట్లు, కమ్యూనిస్టులకు మధ్య జరిగే పోటీలో ప్రజల పక్షాన నిలబడే సిపిఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సింహం ఎప్పుడూ సింగిల్ గానే వస్తుందని, ఈ ఎన్నికల్లో సిపిఐ(ఎం) సింహం లాగా ముందుకు వస్తుందని, కమ్యూనిస్టుల సత్తా చాటాలనే ఖమ్మం జిల్లాలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి సిపిఐ(ఎం)కు మంత్రి పదవులు ఇస్తామనడం విడ్డూరంగా ఉందని, ప్రధాని పదవిని తణప్రాయంగా వదిలేసిన చరిత్ర సిపిఐ(ఎం)కి ఉందని గుర్తు చేశారు. బిజెపిని ఓడించాలనే లక్ష్యం కోసం అన్ని పార్టీలను ఐక్యం చేస్తున్నామని, తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న స్థితిలోనే మునుగోడులో బిఆర్ఎస్ మద్దతు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 9 ఏళ్లుగా బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసింది సిపిఐ(ఎం) మాత్రమేనని స్పష్టం చేశారు. సిపిఐ(ఎం) వేసే ప్రతి ఓటు ఆయుధం అని, బూర్జువా పార్టీలకు ముళ్ళు కర్రలాగా పని చేస్తుందని, వామపక్షాల

మిగతా 3లో...

సీఎం ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయండి
వివరాలు 3లో...

ఐదు నియోజకవర్గాలకు 136 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు

- ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా
- 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు ఈ నెల 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు 136 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. శాసనసభ ఎన్నికలకు శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు ఆమె తెలిపారు. ఈ నెల మూడో తేదీ 10వ తేదీ వరకు (5వ తేదీ ఆదివారం ప్రభుత్వ) జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరణ జరిగినట్లు ఆమె

మిగతా 3లో...

సింగరేణిలో దీపావళి పండుగ రోజును మార్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో దీపావళి పండుగ సెలవు దినం 13వ తేదీకి మార్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ యాజమాన్యాన్ని కోరారు.

సింగరేణిలో దీపావళి పండుగ సెలవు దినం 12వ తేదీన కార్మికులు జరుపుకోవాలని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసిందని కానీ, కోల్ ఇండియా వ్యాప్తంగా దీపావళి పండుగ 13వ తేదీ అని సర్క్యులర్ విడుదల చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 13వ తేదీ అని ప్రకటించిందని తెలిపారు. అదే విధంగా సింగరేణిలో కూడా 13వ తేదీన దీపావళి సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పొంగులేటి ఆస్తులపై ముగిసిన ఐటీ దాడులు



గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు సోదాలు

ఖమ్మం నుంచి భార్య , కుమారుడు ,

తమ్ముడిని హైదరాబాద్ తీసుకుని వెళ్లిన ఐటీ అధికారులు

మొత్తం 30 చోట్ల 400 మంది ఏకకాలంలో రైడింగ్

ఎన్నికల వేళ పొంగులేటిని మానసికంగా

దెబ్బతీసేందుకే దాడులన్న కాంగ్రెస్

ఎన్ని దాడులు చేసినా భయపడే ప్రస్తకే లేదన్న పొంగులేటి

నవతెలంగాణ - ఖమ్మంప్రాంతీయ ప్రతినిధి

పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లు, సంస్థలపై గురువారం తెల్లవారుజాము నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఐటీ దాడులు కొనసాగాయి. కుటుంబసభ్యులు అంతా ఎన్నికల ప్రచారంలో భాగంగా గత 15 రోజులకు పైగా ఖమ్మంలో ఉంటున్నారు. ఆ సమయంలో ఖమ్మంలోని వారి నివాసంలో గురువారం 13 గంటల పాటు సోదాలు నిర్వహించారు. అయినా ఏమీ దొరకలేదని, కుటుంబ అవసరాల కోసం ఉంచుకున్న కేవలం లక్షన్నర రూపాయల మాత్రమే ఉన్నాయని సోదాలు ముగిసిన అనంతరం పొంగులేటి మీడియా కు తెలిపారు. ఖమ్మం లో ఉన్న పొంగులేటి భార్య మాధురి, కొడుకు హర్ష, తమ్ముడు ప్రసాదరెడ్డిలను హైదరాబాద్ కు ఐటీ అధికారులు వెంట తీసుకుని వెళ్లారు. అయితే హైదరాబాద్ లో ఉన్న ఇల్లు, ఆఫీస్ తాళాలు ఇస్తామని చెప్పినా.. ఉండాలని చెప్పి వారిని తీసుకోని వెళ్లారు. శుక్రవారం హైదరాబాద్ లోని రాఘవ కంపెనీ, ఇల్లు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. హార్డ్ డిస్క్ లు, డాక్యుమెంట్లు కొన్ని తీసుకు వెళ్లినట్లు సమాచారం. పొంగులేటి ఇంటిలో ఏమి దొరికాయనేది మాత్రం ఐటీ అధికారులు ప్రకటించలేదు. మొత్తం 30 చోట్ల జరిగిన దాడుల్లో 400 మంది ఐటీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేందుకే దాడులు : పొంగులేటి

ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులకు గురిచేందుకే బీజేపీ, బీఆర్ ఎస్ కుమ్మక్కై దాడులకు పురిగొల్పాయని పొంగులేటి ఆరోపించారు. దాడులు చేస్తారని ముందే ఊహించానన్నారు. ఖమ్మంలోని ఆయన క్యాంప్ ఆఫీసులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తో బీఆర్ ఎస్ కుమ్మక్కు అయిందన్నారు. బీఆర్ యస్ సూచన మేరకే ఈ దాడులు జరిగాయని గట్టిగా నమ్ముతున్నానని పొంగులేటి అన్నారు. కాంగ్రెస్, సీపీఐ పార్టీ ల పొత్తులో ఎన్నికలకు పోతున్నామన్నారు. కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావు గెలుపుకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కోరారు. నేను భయపేడే వాణ్నే అయితే అధికార పార్టీ నుండి బయటకు వచ్చే వాణ్ణి కాదన్నారు. భయపడే వాణ్ణయితే అయితే బిజెపి లోనే జాయిన్ అయ్యే వాణ్ణి అన్నారు. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్, స్టేట్ ఎలక్షన్ కమిషన్ అధికారం లో ఉన్న వాళ్లను ప్రొటెక్ట్ చేస్తున్నారా? అనే సందేహం కలుగుతుందన్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు లోనై నోరు విప్పడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం కాంగ్రెస్ వాళ్ళను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ లో స్ట్రాంగ్ గా ఉన్నదని, ఇక్కడ కాంగ్రెస్ ను అధికారంలోకి రానివ్వద్దని దాడులు చేస్తున్నారని చెప్పారు. ఆ రెండు ఫెవీకాల్ పార్టీలు కలిసి చేస్తున్నాయన్నారు. ఈ రైడింగ్ లో దొరికింది ఏమీ లేదన్నారు. నా అల్లుడిని సైతం ఇబ్బంది పెట్టి భయభ్రాంతులకు గురిచేసి అరెస్టు చేస్తామని బెదిరించారన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ జయప్రకాష్ పై థర్డ్ డిగ్రీ ఉపయోగించారని తెలిపారు. చెప్పినట్టు వినకపోతే జీవితాంతం జైలులో పెడతామని తమ వాళ్లను బెదిరిస్తున్నారని తెలిపారు. ఇవ్వాళ అధికారంలో ఉన్న పార్టీకి వత్తాసు పలికితే రేపు దోషులుగా మీరు కూడా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. బి.ఆర్.ఎస్ పార్టీ నుండి నాతో పాటు బయటకు వచ్చిన నా వాళ్ళపై అనేక అక్రమ కేసులు పెట్టారన్నారు. తమ కంపెనీ మీద ఒక బినామీ పిటీషన్ వేసి మమ్ములను పనులు చేయవద్దని ఇబ్బంది పెట్టారన్నారు. హై కోర్టు నుండి అనుమతులు తీసుకొని తాము పనులు చేస్తున్నామని తెలిపారు. గన్ మెన్ లను తగ్గించినా ఓర్చుకున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుతో తెలంగాణలో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించి మెయిన్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

అకౌంటెంట్ పై థర్డ్ డిగ్రీకి అధికారం ఎవరిచ్చారు?

తన అకౌంటెంట్ జయప్రకాష్ పై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఒంటికాలుపై కుర్చీలో నిలబెట్టారని ఐటీ అధికారులపై పొంగులేటి మండిపడ్డారు. పరిధిని దాటి ఐటీ అధికారులు వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, వారు వారి హద్దుల్లో ఉండాలని చెప్పారు. ఐటీ రూల్స్ తెలియని వారు ఇక్కడ ఎవరూ లేరని అన్నారు. ఐటీ అధికారులు మ్యాన్ హ్యాండ్లింగ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఏమైనా ఆధారాలు దొరికితే కేసులు పెట్టాలే కానీ మనుషులను హింసించడం ఏమిటని మండిపడ్డారు.

దాడులు చేసినా.. జైల్లో పెట్టినా వెనకడుగు ప్రసక్తి లేదు..

తన సంస్థలు, తన బంధువుల ఇళ్లలో దాడులు చేసి తనను మానసికంగా కుంగ దీయడం ద్వారా కాంగ్రెస్ ను దెబ్బకొట్టాలని కేసీఆర్ ఎత్తుగడగా ఉందని మండిపడ్డారు. ఎన్ని దాడులు చేసినా.. చివరకు తనను జైల్లో పట్టినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. నవంబర్ 30 తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పొంగులేటి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండి సురేష్, పుచ్చకాయ కమలాకర్, కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్ బాబు, స్వర్ణకుమారి, తుళ్లూరు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశీర్వాదం తీసుకున్న భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్



సిపిఐ(ఎం) వైరా అసెంబ్లీ అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్ సభ ముగిసిన తర్వాత తన మాతృమూర్తి భూక్యా కమలమ్మ ఆశీర్వాదం తీసుకుని ర్యాలీగా బయలుదేరి వెళ్లి నామినేషన్ వేశారు.

బంతిపూల మాలలు వేసిన ఐద్వా నాయకులు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వైరా అసెంబ్లీ అభ్యర్థి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు తదితరులకు ఐద్వా వైరా పట్టణ, మండలం నాయకులు బంతి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు మచ్చామణి, గుడిమెట్ల రజిత, షేక్ షైనాబి, చావా కళావతి, తాటి కృష్ణకుమారి, బందెల అమృతమ్మ, దేవబత్తిని లక్ష్మీతులసి, బత్తుల ప్రమీల, బత్తుల కరుణ, ఓర్పు అనిత, షేక్ ఫాతిమా, షేక్ రెహానా, షేక్ మజీద్ బీ తదితరులు పాల్గొన్నారు.

78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

సీఎల్పీ నేత భట్టి, మాజీ ఎంపీ పొంగులేటి

చింతకానిలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

నవతెలంగాణ-చింతకాని



తెలంగాణలో అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ 78 స్థానాల్లో గెలుపొంది డిసెంబర్ 9న ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు శుక్రవారం రాత్రి చింతకాని మండల కేంద్రంలో పలు పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు ఈ సందర్భంగా భట్టి, పొంగులేటి మాట్లాడుతూ పదేళ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చి పొరపాటు చేశారని అన్నారు. ఈ ఒక్కసారి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కిలారు మనోహర్, తిరుపతి, అంజయ్య, కన్నబోయిన సీతారామయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నాయకులు, మడిపల్లి భాస్కర్, గోపి, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే శ్రీకాంత్‌ని గెలిపించండి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలో నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌ని గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు జే.వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని సీపీఎం జిల్లా కార్యాలయం నుండి సీపీఎం ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి ప్రచార వాహనాలను సీపీఎం రాష్ట్ర నాయకుడు జే.వెంకటేష్, అసెంబ్లీ అభ్యర్థి యర్రా శ్రీకాంత్, జిల్లా నాయకులు వై. విక్రమ్ సీపీఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మంలో రెండు కార్పొరేట్ శక్తులు ఎన్నికలలో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని, వారు ఎప్పుడైనా ప్రజా సమస్యలపై పోరాడేరా అన్ని ప్రజలు ఆలోచించి నిత్యం ప్రజల కోసం కార్మికుల కోసం పనిచేస్తున్న సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌ని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ శోభన్, సీపీఎం జిల్లా నాయకులు మెరుగు సత్యనారాయణ, నందిపాటి.మనోహర్, తుమ్మ.విష్ణు, షేక్.మీరా, వై.శ్రీనివాసరావు, పిన్నింటి రమ్య, చింతల రమేష్, షేక్.గౌస్, తుడుం ప్రవీణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తం పారించే గ్రామాల్లో నీటిని పారించా

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-చింతకాని

రక్తం పారించే గ్రామాల్లో సాగునీటిని పారించి సస్యశ్యామలం చేశానని సీఎల్పీ నేత మధిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు శుక్రవారం రాత్రి చింతకాని రేపల్లెవాడ గ్రామాల్లో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నాలుగోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలించేవాడిగా మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్ర భాగాన నిలుపుతానని పేర్కొన్నారు చింతకాని మండలంలో దళిత మహిళ లాకప్ డెత్ జరిగితే కమల్ రాజు ఎటు వెళ్ళాడని ప్రశ్నించారు తాను పోరాడి రీ పోస్టుమార్టం జరిపించి మరియమ్మ కుటుంబానికి న్యాయం చేశానని ఈ క్రమంలోనే చింతకాని మండలానికి దళిత బంధు మంజూరి అయిందని గుర్తు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప మండలంలో ఏ అభివృద్ధి జరగలేదని టిఆర్ఎస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందని తనను అత్యధిక మెజార్టీతో పాలించేవాడిగా శాసనసభకు పంపించాలని ఓటర్లను కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి మడుపల్లి భాస్కర్ గోపి కొప్పుల గోవిందరావు మజీద్ నాగార్జున కిలారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ ప్రముఖ నేతలు

- మాజీ మంత్రి సంభాని సహా

మానవతారాయ్, ఎడవల్లి తదితరుల చేరిక

- సీఎం కేసీఆర్ సమక్షంలో

గులాబీ కండువాలు కప్పుకున్న నేతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



మాజీ మంత్రి, టీపీసీసీ ముఖ్య నేత సంభాని చంద్రశేఖర్ సహా ఖమ్మం జిల్లా కు చెందిన పలువురు నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు ఎడవల్లి కృష్ణ, కోటూరి మానవతారాయ్, డాక్టర్ రాంచందర్ నాయక్, మడత వెంకట్ గౌడ్‌లకు కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దగ్గరుండి మరీ నేతలందరినీ పార్టీలో చేర్పించారు. తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతున్న బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసమే తామంతా పార్టీ లో చేరుతున్నామని వారంతా ప్రకటించారు. పార్టీలో చేరిన నాయకులందరి సేవలు వినియోగిం చుకోవాలని సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా నేతలకు సూచించారు. అంతకు ముందు వీరందరినీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగతిభవన్‌కు పిలిపించుకుని పార్టీలోకి ఆహ్వానిస్తూ.. శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వచ్చిన ముఖ్య అనుచరులకు కేటీఆర్ స్వయంగా గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి స్వాగతించారు. పార్టీలో చేరిన నేతలందరికీ ఎంపీ రవిచంద్ర స్వాగతం పలుకుతూ.. కృతజ్ఞతలు తెలిపారు. వీరి చేరికకు బీఆర్ఎస్ జిల్లా ముఖ్య నేతలంతా సమిష్టిగా కృషి చేశామని రవిచంద్ర ప్రకటించారు. జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, బానోత్ హరిప్రియా నాయక్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సీహెచ్‌సీలో మొదటి సిజేరియన్ శస్త్ర చికిత్స విజయవంతం

- డీసీహెచ్ఎస్, వైద్య బృందాన్ని అభినందించిన కలెక్టర్



నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో తొలిసారిగా సిజేరియన్ ఆపరేషన్ (పెద్ద ఆపరేషన్) గత అక్టోబర్ 31 మంగళవారం విజయవంతంగా సుమారు 3 కేజీల పండంటి మగబిడ్డకు ప్రాణం పోశారు. ఇప్పటి వరకు పెద్ద ఆపరేషన్‌లు కోసం జిల్లా కేంద్రం అయిన కొత్తగూడెం లేదా భద్రాచలం వెళ్ళాల్సి వచ్చేది. దీంతో పేద ప్రజలకు ఎంతో వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేది. అక్కడ ఉండి ఆపరేషన్ చేసిన వారం రోజులకి ఇక్కడకి స్వగ్రామాలకు వచ్చేవారు. తదుపరి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్న సూదర ప్రాంతం వెళ్లాల్సి వచ్చేది. కానీ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ప్రత్యేక కృషితో ఇటీవల ఒక ప్రసూతి వైద్యురాలును అశ్వారావుపేట సీహెచ్‌సీలో నియమించడం ద్వారా స్థానికంగానే సిజేరియన్ సెక్షన్ ఆపరేషన్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్, గర్భిణీలకు స్కానింగ్, ఇతర ప్రసూతి సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత నెల 31న ఆసుపత్రి చరిత్రలోనే మొట్ట మొదటిది సిజేరియన్ ఆపరేషన్‌ను కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో డీసీహెచ్ఎస్ పర్యవేక్షణలో అశ్వారావుపేట మండలం వేదాంత పురం నుండి వచ్చిన ఎస్.కే సుభాని అనే గర్భిణీకి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసి మగ బిడ్డకి జన్మనిచ్చారు. ఈ నెల 7 మంగళవారం డిశ్చార్జ్ చేసిన సందర్భంగా వివరాలు మీడియాకి తెలియపరిచారు. ప్రసూతి వైద్యురాలు డాక్టర్ రాధ రుక్మిణీ, మత్తు వైద్యులు డాక్టర్ రామ్ ప్రసాద్, పిల్లల వైద్యులు డాక్టర్ ముక్కంటేశ్వరరావు, ఇతర వైద్య బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

సీపీఐ(ఎం) త్యాగాల చరిత్రకు... (మొదటిపేజీ తరువాయి...)

అవసరాన్ని గుర్తించి నిరంతరం ప్రజల కోసం పనిచేసే భూక్యా వీరభద్రంను గెలిపించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఏ స్వార్థం లేకుండా నిస్వార్థంగా ప్రజాసేవ చేసేందుకే సిపిఐ(ఎం) ఎన్నికల్లో పోటీ చేస్తుందని, రోజుకొక పార్టీలు మారుతున్న వారిపట్ల వైరా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలంగాణ అసెంబ్లీలో వైరా నియోజకవర్గం సమస్యలపై గళం విప్పి అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి భూక్యా వీరభద్రంను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. నిస్వార్థ రాజకీయ నాయకుడైన భూక్యా వీరభద్రంను అసెంబ్లీకి పంపడం ద్వారా వైరా సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సిపిఐ(ఎం) అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఉన్న రోజులలో అధికారంలో ఏ పార్టీ ఉన్నా పోరాడి అభివృద్ధికి నిధులు సాధించే వారని గుర్తు చేశారు. బొడేపూడి వెంకటేశ్వరరావు, కట్టా వెంకట నరసయ్య, కేవల్ నరసింహారావు, బుచ్చయ్య, మహబూబ్ రజబలీ, మంచికంటి రాంకిషన్ తదితర మచ్చలేని ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నేతల పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న భూక్యా వీరభద్రంను గెలిపించి ప్రజా పోరాటాలకు మద్దతు తెలపాలని, అవకాశవాద రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి వైరా గడ్డపై ఎర్రజెండాను ఎగుర వేయాలని కోరారు.

నామినేషన్ సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, కాసాని ఐలయ్య, ఐలా జాతీయ నాయకులు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి, సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, పారుపల్లి ఝాన్సీ, మండల కార్యదర్శులు తోట నాగేశ్వరరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, కుందనపు నరేంద్ర, యాసా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నియోజకవర్గాలకు...

(మొదటిపేజీ తరువాయి...)

చెప్పారు. పినపాకలో 25 మంది, ఇల్లందు-34, కొత్తగూడెం-36, అశ్వారావుపేట-23, భద్రాచలం-18 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు చెప్పారు. మొత్తం ఐదు నియోజకవర్గాలకు 136 మంది అభ్యర్థులు 211 సెట్లు నామినేషన్స్ వేసినట్లు చెప్పారు.

ఈ నెల 13వ తేదీన నామినేషన్లు పరిశీలన, ఉంటుందని, 15వ తేదీన నామినేషన్లు ఉపసంహరణ వుంటుందని, తదుపరి అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ జరుగుతుందని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని ఆమె సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసినందున ప్రచార కార్యక్రమాలపై పటిష్ఠ నిఘా కొనసాగించాలని చెప్పారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో నిరంతర పటిష్ఠ నిఘా ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగితే ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు తగు చర్యలు చేపట్టాలని ఆయా నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే ప్రజలు సి విజిల్ యాప్‌కు కానీ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24 గంటలు పని చేయు 1950 కంట్రోల్ రూముకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఫిర్యాదు స్వభావాన్ని ఆయా వ్యక్తులకు సెల్ ఫోన్స్‌కు సమాచారం అందించడం జరుగుతుందని చెప్పారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మన లక్ష్యం ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని చెప్పారు. ఎన్నికలు నిర్వహణకు ప్రతి ఒక్కరూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆమె సూచించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌కు అర్హత సాధించిన రోహిన్‌తరుణ్



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లా బచ్చోడులోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఆటల పోటీలు జరిగాయి. ఈ క్రీడలలో మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల (బాలుర వైరా)లో చదువుతున్న విద్యార్థి ఆర్.రోహిన్ తరుణ్ నెట్ బాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 25న ఖమ్మంలో జరగబోవు స్టేట్ లెవెల్ (అండర్-17) ఆటల పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆర్‌సీఓ అంజలి, ప్రిన్సిపాల్ పి.మల్లయ్య, పీఈటీ రవి, ఏటీపీలు ఎండీ జాహెదా, కే.రాజు డిప్యూటీ వార్డెన్లు బండి లక్ష్మీనారాయణ, ఎస్.కే.భాషా, ఇతర ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

అశ్వారావుపేటలో ఖాళీ అవుతున్న కారు

- బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన 20 కుటుంబాలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి తుమ్మల



నవతెలంగాణ-ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట మండలం, అచ్యుతాపురం ఎంపీటీసీ కాసాని దుర్గ సహా అచ్యుతాపురం మద్ది కొండ గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు ఎంపీటీసీ కాసాని దుర్గ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఖమ్మంలోని తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ రాబోవు రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంకా భారీ చేరికలు ఉంటాయని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో అచ్యుతాపురం ఎంపీటీసీ కాసాని దుర్గ, మురళి, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కొనకళ్ళ చెన్నారావు, మొడియం లక్ష్మయ్య, వార్డు మెంబర్ నారం ముత్యాలు, నందిగామ రవి, బొల్లేని భరత్, తట్టుకోల నవీన్, వెచ్చా దుర్గారావు, పోలయ్య, సహా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పాలడుగు నామినేషన్‌కు తరలిన సీపీఐ(ఎం) శ్రేణులు



నవతెలంగాణ-ముదిగొండ

మధిర నియోజకవర్గం సిపిఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ శుక్రవారం మధిరలో వేసిన నామినేషన్ సభకు ముదిగొండ మండలంలోని వివిధ గ్రామాల నుండి సిపిఐ(ఎం) శ్రేణులు వాహనాల ద్వారా భారీగా తరలి వెళ్లారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ఆధ్వర్యంలో ముదిగొండ, వెంకటాపురం, గోకినేపల్లి చిరుమర్రి, పమ్మివల్లాపురం, అమ్మపేట, కమలాపురం, బాణాపురం, పెద్దమండవ, కట్టకూరు యడవల్లి తదితర గ్రామాలలో టాటాఏసీ, ఆటోలలో పార్టీ కార్యకర్తలు, నాయకులు సానుభూతిపరులు ఎర్రజెండాలతో భారీ సంఖ్యలో మధిరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, బట్టు రాజు, ఇరుకు నాగేశ్వరరావు, కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, సామినేని రామయ్య మాదారపు శ్రీనివాసరావు, కందిమళ్ల తిరుపతి, మరికంటి వెంకన్న, యండ్రపల్లి రవికుమార్, పండ్రకోల రాంబాబు, చింతకాయల రామారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పూజాలో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర



నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కొత్త వెంకటగిరి గ్రామంలో జర్పుర్ల రాంబాబు శుక్రవారం హనుమాన్ చాలీసా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ దూర్గా శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి భద్రరాజు, రైతుబంధు మండల అధ్యక్షులు దుగ్గిదేవర వెంకట్ లాల్, ఉప సర్పంచ్ దిర్సాల నరేష్, నాయకులు మల్లెల గోపాలరావు, దీవెన రామారావు, కోపెల్ల శ్రీను, షేక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయండి

- బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం

నవతెలంగాణ-మణుగూరు

ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని, సీఎం కేసీఆర్ పాలన రాష్ట్రానికి శ్రీరామ రక్షా అని, బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు తెలిపారు. శుక్రవారం అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులైై కాంగ్రెస్ పార్టీ చెందిన సుమారు 200 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. ఈ నెల 13వ తేదీన బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు కార్యకర్తలు పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నెల 30 తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి

- అప్పీల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోళ్ళ రమేష్



నవతెలంగాణ-ములకలపల్లి

అప్పీల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోళ్ళ రమేష్ ములకలపల్లి మండలంలోని కంపగూడెం, రంగాపురం, మూక మామిడి ఎస్సీ కాలనీ, సాయిరాంపురం గ్రామాలను సందర్శించి ఆ గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపగూడెం గ్రామంలోని అనేక గిరిజన కుటుంబాలకు సాగు భూమి ఉన్నప్పటికీ పాసుబుక్కులు రాక ధరణిలోని ఇబ్బందుల వల్ల మోటారు పంపులు, కరెంట్ లైన్లు, శాంక్షన్ కాకపోవడం వల్ల వ్యవసాయం చేసుకోవడం ఇబ్బందిగా మారిన విషయం వారి దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. దానికి రమేష్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వంతోనూ, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్‌తోనూ మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రంగాపురం గ్రామంలో శ్రీ వీరభద్ర రావు అనే వ్యక్తి కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనేక నెలలుగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. అదేవిధంగా సాయిరాంపురం గ్రామంలో శ్రీ నాగేశ్వరరావు అనే ఒక గిరిజన వ్యక్తి సుమారు ఏడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్లో కాలు పోగొట్టుకొని నడవలేక ఇంట్లోనే ఉంటున్న విషయాన్ని వారి దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. ఆ వ్యక్తికి జైపూర్ కాలును అమర్చడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో ఈ గ్రామాలన్నిటిలో కూడా అప్పీల్ యువసేన అనే కమిటీలను ఏర్పాటు చేసి వారి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి ప్రసాద్, గరిక యాదగిరి, శ్రీ నాగేశ్వరరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

పాలడుగు నామినేషన్‌కు తరలిన సీపీఐ(ఎం) శ్రేణులు

నవతెలంగాణ-ముదిగొండ

మధిర నియోజకవర్గం సిపిఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ శుక్రవారం మధిరలో వేసిన నామినేషన్ సభకు ముదిగొండ మండలంలోని వివిధ గ్రామాల నుండి సిపిఐ(ఎం) శ్రేణులు వాహనాల ద్వారా భారీగా తరలి వెళ్లారు. సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ఆధ్వర్యంలో ముదిగొండ, వెంకటాపురం, గోకినేపల్లి చిరుమర్రి, పమ్మి,వల్లాపురం, అమ్మపేట, కమలాపురం, బాణాపురం, పెద్దమండవ, కట్టకూరు యడవల్లి తదితర గ్రామాలలో టాటాఏసీ, ఆటోలలో పార్టీ కార్యకర్తలు, నాయకులు సానుభూతిపరులు ఎర్రజెండాలతో భారీ సంఖ్యలో మధిరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, బట్టు రాజు, ఇరుకు నాగేశ్వరరావు, కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, సామినేని రామయ్య మాదారపు శ్రీనివాసరావు, కందిమల్ల తిరుపతి, మరికంటి వెంకన్న, యంద్రపల్లి రవికుమార్, పంద్రకొల రాంబాబు, చింతకాయల రామారావు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ నామినేషన్ కార్యక్రమానికి బోనకల్ మండలంలోని 22 గ్రామాల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు శుక్రవారం పెద్ద సంఖ్యలో కదిలి మధిర వెళ్లారు. పాలడుగు భాస్కర్ మధిర ఎన్నికల అధికారికి తమ నామినేషన్ పత్రాన్ని అందజేశారు అనంతరం మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు సమీపంలోనే బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు బోనకల్ మండలం నుంచి సుమారు 1500 మంది కదిలినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామం నుంచి 100 మంది ఎర్రచొక్కాలు, ఎర్ర చీరల ధరించి బయలుదేరి వెళ్లారు. చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన మహిళలందరూ ఎర్ర చీరలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండలంలోని 22 గ్రామాల నుంచి వెళ్లిన దాదాపు ప్రతి ఒక్కరూ ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి వెళ్లడం విశేషం. పురుషులు ఎర్ర చొక్కాలు ధరించి మోటార్ సైకిల్ ర్యాలీ గా మధిర వెళ్లారు. వివిధ గ్రామాల నుంచి అనేకమంది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, టాటా ఏసీల ద్వారా మధిర నామినేషన్ కార్యక్రమానికి వెళ్లారు.

నేడు ఎర్రబోయిన నాగేశ్వరరావు స్తూపావిష్కరణ



నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు స్తూపావిష్కరణను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆవిష్కరిస్తారని ఆ పార్టీ గ్రామ శాఖల కార్యదర్శులు ఏడు నూతల లక్ష్మణరావు, బండి చంద్రావు, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని రామచంద్రరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎర్రబోయిన నాగేశ్వరరావు సమస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమస్మరణ సభకు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కామ్రేడ్స్‌లో నూతన ఉత్తేజం.. ఎరుపెక్కిన వైరా

నామినేషన్ ర్యాలీకి భారీగా తరలివచ్చిన ప్రజలు

నవతెలంగాణ-వైరా టౌన్



ఎవరినో గెలిపించడానికో, మరెవరినో ఓడించడానికో ఎన్నికల్లో సిపిఐ(ఎం) పోటీ చేయడం లేదని, వైరా గడ్డపై ఎర్రజెండా సత్తా చటడం కోసం ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నామని తమ్మినేని చేసిన ఉపన్యాసం కార్యకర్తలలో నూతన ఉత్తేజం, ఉత్సాహం నింపింది. ఎన్నికల సమరంలో ఎర్ర జెండ సత్త చాటాలని సిపిఐ(ఎం) కార్యకర్తలు నయా జోష్ తో వైరా పట్టణంలో భారీగా నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. సిపిఐ(ఎం) వైరా ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్ ర్యాలీకి నియోజకవర్గం పరిధిలోని వైరా, కొణిజర్ల, ఎన్కూర్, కారేపల్లి జూలూరుపాడు మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. వైరా పట్టణంలో బహిరంగ సభ నిర్వహించిన అనంతపురం పట్టణ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా వీరభద్రం తదితర అగ్రనాయకత్వం ప్రదర్శన ముందు భాగంలో ఉండి నడిపించారు. గిరిజన నృత్యాలు, మహిళల కోలాటం, డప్పు దళం డాన్స్ లతో కార్యకర్తలు ఉత్సాహంగా పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరు అరుణ పతాకాన్ని చేతపట్టి సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి అంటూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎక్కవ సంఖ్యలో ప్రజలు, పార్టీ అభిమానులు తరలిరావడంతో సభ ప్రాంగణం కూడా నిండిపోయింది. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో వైరా గడ్డపై సిపిఐ(ఎం) తన సత్తా చాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కొణిజర్ల : వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్‌కి కార్యక్రమానికి మండలంలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. సుమారు వందల సంఖ్యలో హాజరై నామినేషన్‌కి ర్యాలీలో పాల్గొన్నారు.

చిన్నగోపతి మహిళ శాఖ జిల్లాకే ఆదర్శం..

మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామానికి చెందిన సీపీఎం మహిళ శాఖ సభ్యులు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా పార్టీ ఇచ్చే ప్రతి పిలుపులో వీరి భాగస్వామ్యం ఉంటుంది. ఉద్యమాలు ఆందోళనలు పార్టీ సమావేశాలు తదితర కార్యక్రమాల్లో వీరంతా ఐక్యంగా వచ్చి పాల్గొంటారు. సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్ సభకి వచ్చిన వీరు పార్టీపై ఉన్న ప్రేమతో సభలో కిందకూర్చొని పార్టీ పట్ల వారికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు.

పాలేరు ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ కొనలేరు

బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కొంత మంది బయటి నుంచి వచ్చి డబ్బు మదంతో, అహంకారంతో పాలేరు ప్రజల ఆత్మగౌరవాన్ని కొనవచ్చని తిరుగుతున్నారని, పాలేరు ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ కొనలేరని, బయటి నుంచి వచ్చిన వారిని ఓడించాలని బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తెల్దారుపల్లి, నడిమితండా, నాయుడుపేట, మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల కుల, మతాలకు అతీతంగా పాలేరు ప్రజలకు సేవ చేసినట్లు వివరించారు. ఘర్షణలు, కొట్లాటలు లేని ప్రశాంతమైన పాలేరు నియోజకవర్గం కోసం తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. పాలేరు నియోజక వర్గంలో ఒక్క మట్టి రోడ్డు కూడా లేకుండా మొత్తం సిమెంట్ రహదారులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత తొమ్మిదిన్నర ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి అవకాశం కల్పిస్తే అమలు చేస్తున్న పథకాలతో పాటుగా, కొత్త పథకాలను అమలు చేస్తామని వివరించారు. ప్రజలంతా ఆలోచించి కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. నడిమితండా, నాయుడుపేట, రామన్నపేట, మంగళగూడెం, తిరుమలాయపాలెం మండలం హలావతండా, బిచ్చురాజుపల్లి, పడమటితండా, తిప్పారెడ్డి గూడెం, కూసుమంచి మండలంలోని గన్యాతండా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు జీవనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందాళ దీపిక ఇంటింటి ప్రచారం

కూసుమంచి : పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గెలుపు కోరుతూ శుక్రవారం మండలంలోని చేగొమ్మ గ్రామంలో ఎమ్మెల్యే కందాళ కుమార్తె కందాళ దీపికా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాళ

మండలంలోని లోక్యా తండా గ్రామంలో ఎంపీటీసీ జర్పుల బాలాజీ స్వగృహంలో అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అందుబాటులో ఉంటా...ఆదరించండి

- సీపీఐ(ఎం)ని గెలిపించాలని విజ్ఞప్తి
- 45ఏండ్ల నుంచి పార్టీలోనే ఉంటున్నా... ఏ సమస్య వచ్చినా ఆదుకుంటా
- సీపీఐ(ఎం) ఖమ్మం అభ్యర్థి ఎర్రా శ్రీకాంత్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రీ టౌన్ ప్రాంతంలో సీపీఐ(ఎం) ఖమ్మం అసెంబ్లీ నియోజవర్గ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ వాకర్స్‌ని కలిసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం ప్రజల కోసం కార్మికుల కోసం తాను పనిచేస్తానని, ఎప్పుడు ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. గత నలభై ఐదు సంవత్సరాల నుంచి సిపిఎంలోనే ఉన్నానని, అనేక పోరాటాలు ప్రజల సమస్యల కోసం చేశానని తెలిపారు. అందుకనే ఈ ఎన్నికల్లో సిపిఎంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు యర్రా రమేష్, నాయకులు సోమవరపు సుధీర్, శీలం వీర బాబు, రంగు చారి, ఎస్కే బాబు, పోతురాజు జార్జి, ఎర్ర నగేష్, ఎర్ర రంజిత్, భూక్య సుభద్ర,

ముఖ్యమంత్రి అభ్యర్థినని చెప్పుకోవడం హాస్యాస్పదం

- 15 ఏండ్లలో మధిరకు చేసింది శూన్యం
- నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. సేవకుడిగా పని చేస్తా
- రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్‌కే అధికారం
- మధిర బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



'రాష్ట్ర శాసన సభ పక్ష నాయకుడిగా 20 మంది శాసన సభ్యులను కాపాడుకోలేని నీవు ముఖ్యమంత్రి అభ్యర్థివని చెప్పు కోవడం హాస్యాస్పదంగా' ఉందని బీఆర్ఎస్ మధిర నియోజక వర్గ అభ్యర్థి లింగాల కమలరాజ్ భట్టిని ఉద్దేశించి ఘాటుగా విమర్శించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని సకిన వీడు, ములుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల కాలంలో మధిర అభివృద్ధికి భట్టి చేసింది శూన్యమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతోనే మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపా యల అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదే అని మధిరలో కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఉండాలన్నారు. వ్యాపారాలు రాజకీయాల పేరుతో హైదరాబాదు, ఢిల్లీలో ఉండే పని నాకు లేదన్నారు. మీ మధ్యనే ఉంటూ మధిర నియోజకవర్గ అభివృద్దే నా ధ్యేయం గా పనిచేస్తానన్నారు.కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించి ఒక్కసారి శాసనసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వండి మీ సేవకుడిగా పని చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత, వైస్ ఎంపీపీ సురానేని రామ కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి అంకశాల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షు లు శెట్టిపల్లి మదన్మోహన్‌రెడ్డి, అనుమోలు సాంబశివరావు, మూల్పూరి శ్రీనివాసరావు, సర్పంచులు మొగిలి అప్పారావు, విజయ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, తాళ్లూరి హరీష్, సగ్గుర్తి కిషోర్ బాబు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యక ర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భద్రాద్రికి భవిష్యత్తు ఎర్రజెండానే

- వేకువ జామునే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన కారం పుల్లయ్య

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం అరాచకాలు, దందాలు లేని ప్రశాంత భద్రగిరి నిర్మాణం కోసం సుత్తి కొడవలి చుక్కపై ఓటు వేసి భద్రాద్రి భవిష్యత్తుకి ఎర్రజెండాను అండగా నిలపాలని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య ప్రజలను కోరారు. భద్రాచలం పట్టణంలో వేకువ జామునే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన ఆయన కాలేజీ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సున్నం రాజయ్య, కుంజా బొజ్జి పోరాటాల వారసత్వంతో రాజకీయాలోకి వచ్చిన తనను ఎన్నికలలో గెలిపించాలని కోరారు. భద్రాచలాని వరద నుండి కాపాడేందుకు సీపీఐ(ఎం) దగ్గర నిర్దిష్ట ప్రణాళిక ఉందని, రానున్న రోజుల్లో ప్రజలను ఐక్యం చేసి ముప్పు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, రమేష్, కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకట రామారావు, పారేల్లి సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసిన సీపీఐ(ఎం) అభ్యర్థి

నవతెలంగాణ-అశ్వారావుపేట



సీపీఐ(ఎం) అభ్యర్థి పిట్టల అర్జున్ రావు తన రెండో సెట్ నామినేషన్ పత్రాలను శుక్రవారం అందజేసినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య, మండల కార్యదర్శి చిరంజీవి, మండల కమిటీ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం జగన్నాథంలు పాల్గొన్నారు. గురువారం అర్జున్ రావు తన మొదటి నామినేషన్‌ను, గొగ్గెల ఆదినారాయణ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయం పాఠకులకు విధితమే. శుక్రవారం అర్జున్ రావు తన రెండో సెట్ నామినేషన్‌తో పార్టీ తరుపున ఇరువురు మూడు సెట్‌లు దాఖలు చేసారు.

బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఎడవల్లి కృష్ణ

- కండువా కప్పి ఆహ్వానించిన కేసీఆర్

నవతెలంగాణ-పాల్వంచ



గత ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేసి కొత్తూరు నియోజకవర్గ నుండి కాంగ్రెస్ టికెట్ ఆశించి నిరాశకు గురైన ఎడవల్లి కృష్ణ ఎట్టకేలకు రాజకీయ నిర్ణయం తీసుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు కుమారుడు నవీన్ అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కొత్తగూడెం అసెంబ్లీ టికెట్‌ని ఆశించిన ఎడవల్లికి సీపీఐ రూపంలో మరోసారి టికెట్ దూరం కావడంతో తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయారు. దీంతో తన శ్రేయోభిలాషులు, అనుచరులు నాయకులతో మంతనాలు జరిపి కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. కొత్తగూడెం నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యే కావాలని లక్ష్యంతో ఆయనే పలుమార్లు పలు పార్టీల నుండి ప్రయత్నాలు చేశారు. గత మూడు సార్లు ఏదో ఒక ప్రధాన పార్టీకి పనిచేసే చివరికి టికెట్ దక్కపోవడంతో మరో పార్టీ నుంచి పోటీ చేయడం ఓడిపోవడం పరిపాటిగా మారిపోయింది. అయినా సరే వెనుకకు తగ్గకుండా ప్రతిసారి ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు. 2009లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి సుమారు 30 వేల కోట్లు సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీలో టికెట్ రాకపోవడంతో అప్పుడు కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా ఈ సీట్ను సిపిఐకి వెళ్లడంతో వనమా వెంకటేశ్వర్ రావు కాంగ్రెస్ దీంతో వైసిపి టికెట్ ఆశించినా బంగపాటు తప్పలేదు. ఆ తర్వాత ఎడవల్లి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చురుగ్గా పనిచేస్తూ నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. వైసీపీ నుంచి ఓడిన వెంకటేశ్వర్లు 2018లో ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మళ్ళీ టికెట్ దగ్గించుకున్నారు. 2023 ఎన్నికల్లో ఎలాగైనా తరగతి టికెట్ వస్తుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి తన పేరును ప్రతిపాదించి ప్రకటిస్తారని ఆశలు పెట్టుకున్నప్పటికీ మళ్లీ ఆయనకు నిరాశ మిగిలింది. కాంగ్రెస్, సీపీఐ పొత్తుల భాగంగా ఈ సీటు సీపీఐకి కేటాయించడంతో చివరి వరకు ఎదురు చూసినా ఎడవల్లి టికెట్ దక్కకపోవడంతో తీవ్ర నిరాశకులోని కార్యకర్తలతో సమావేశంలో జరిపారు. రాజకీయ భవిష్యత్తుపై ఆయనే నిర్ణయం తీసుకొని శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

- నామినేషన్ దాఖలు చేసిన ప్రతాప్

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలో బిఎస్పి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం గ్రామాలు, తండాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక సుభాష్ నగర్ నుండి ప్రారంభమైన ప్రదర్శన వివిధ సెంటర్ల గుండా గోవింద్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ నియోజవర్గ అసెంబ్లీ అభ్యర్థి బాదావత్ ప్రతాప్ మాట్లాడారు. బహుజన సమాజ్వాది పార్టీ బిఎస్పీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నియంత పాల సాగిస్తున్న మోడీ కేసీఆర్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బిఎస్పి ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కాశయ్యకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- భద్రాచలంలో ఖాయమైన త్రిముక పోటీ
- నామమాత్రంగానే బీజేపీ, బీఎస్పీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు మొదటి ఘట్టమైన నామినేషన్ ప్రక్రియ పూర్తయింది. పోటీలో ఉన్న రాజకీయ పార్టీలను పరిశీలిస్తే భద్రాచలం ఏజెన్సీలో మరోసారి త్రిముక పోటీ ఖాయమైనట్టు స్పష్టంగా కనబడుతుంది. ప్రధానంగా సీపీఐ(ఎం) నుండి కారం పుల్లయ్య కాంగ్రెస్ పార్టీ నుండి పోదెం వీరయ్య బీఆర్ఎస్ పార్టీ నుండి తెల్లం వెంకటరావులు పోటీలో ఉన్న నేపథ్యంలో ఈ ముగ్గురి మధ్యలోనే తీవ్రమైన పోటీ నెలకొననుంది. బిజెపి, బీఎస్పీతోపాటు పిరమిడ్ అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నప్పటికీ నామమాత్రం గానే ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే భద్రాచలంలో ఎన్నికల హీట్ తారస్థాయికి చేరగా ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు వలసల పైనే ప్రధాన దృష్టి పెట్టినట్టుగా కనిపిస్తుంది. పోటీలు పడి మరి ఇతర పార్టీల నాయకులకు వలవేసి జండా కప్పి రాజకీయ బలాన్ని చాటాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుండి తాత మధు కాంగ్రెస్ నుండి బాలసాని లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా పార్టీ ఫిరాయింపుల పైనే ప్రధానంగా దృష్టి పెట్టినట్టుగా తెలుస్తుంది. భద్రాచలం నియోజవర్గానికి గతంలో చేసింది ఏమీ లేక భవిష్యత్తులో చేసేది స్పష్టమైన హామీ ఇచ్చే పరిస్థితిలేని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో రాజకీయ నాయకుల వరసలతోనే గట్టెక్కాలని చూస్తున్నారని విమర్శలు వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం నియోజవర్గ ప్రజలకు ఖచ్చితమైన భవిష్యత్తు హామీని ఇస్తూ గతంలో సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధిని ప్రచార హస్తాలుగా మలుచుకొని తనదైన శైలిలో సీపీఐ(ఎం) ఎన్నికల్లో దూసుకుపోతుంది. ఇప్పటికే నియోజవర్గంలోని అన్ని మండలాలలో కార్యకర్తలను ఎన్నికల సమరానికి సిద్ధం చేసి ప్రజల్లోకి పార్టీ అభ్యర్థిని విస్తృతంగా తీసుకువెళుతున్నారు. ప్రధానంగా కరోనా సమయంలో ఐసోలేషన్ సెంటర్ నిర్వహించి ప్రజల ప్రాణాలను కాపాడటమే కాక కరోనాతో మృతి చెందిన వారి దాన సంస్కరణలు కూడా పార్టీ కార్యకర్తలే నిర్వహించడం ప్రజల్లో విస్తృతంగా సీపీఐ(ఎం)కి మైలేజీ వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఈ ఎన్నికలలో భద్రాచలం ఏజెన్సీ రానున్న ఎన్నికలలో త్రిముక పోటీలో భద్రాచలం నియోజకవర్గం ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో వేచి చూడాల్సి ఉంది.

బీఆర్ఎస్‌లోకి వలసలు...!

- అవుట్ గోయింగ్ ఇన్‌కమింగ్
- ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో చేర్తారో అయోమయం
- మాజీ మంత్రి సంభాని, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మడత ఎంపీ రవిచంద్ర నేతృత్వంలో మంత్రి కేటీఆర్‌తో చర్చలు

నవతెలంగాణ-ఇల్లందు



గత వారం పది రోజులుగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్, బీజేపి బీఆర్ఎస్‌లో కుదుపుల్లో షాక్‌లు ఎక్కువయ్యాయి. ఎవరు ఎప్పుడూ ఏ పార్టీలో చేరుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఒక పార్టీ నుండి మరోక పార్టీలోకి మారుతూ షాక్‌లు ఇచ్చుకుంటున్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇటీవల మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, కౌన్సిలర్లు సర్పంచ్లు, పిఎసిఎస్ చైర్మన్ ఇలా బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసమ్మతినేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి హైదరాబాదు పయనమయ్యారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ.రామారావుతో శుక్రవారం భేటీ అయ్యారు. అలాగే, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఊకే అబ్బయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడవల్లి కృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్, ఇల్లందు నియోజకవర్గ ప్రముఖులు, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మడత వెంకట్‌గౌడ్, ఇల్లందు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి సర్జన్ డా. రామచంద్ర నాయక్ తదితరులు తమ ముఖ్య అనుచరులతో పాటు ఎంపీ రవిచంద్ర నేతృత్వంలో శుక్రవారం మధ్యాహ్నం కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి, బీఆర్ఎస్ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు సంపూర్ణ మద్దతునివ్వాల్సిందిగా కేటీఆర్ కోరగా, అందుకు వారు సానుకూలంగా స్పందించారు. వీరంతా కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.



హస్తంలోకి భారీ చేరికలు

నవతెలంగాణ-ములకలపల్లి

మండలంలో బీఆర్ఎస్ బిగ్ షాక్ ఇచ్చిన ప్రజాప్రతినిధులు, మండల వ్యాప్తంగా మంచి క్యాడర్ ఉండి, ప్రజాదరణ ఉన్న యువ సర్పంచ్ కారం సుధీర్ తోపాటు, ఇద్దరు సర్పంచులు, ఓ డిసిసిబి డైరెక్టర్ నాయకులు, బీఆర్ఎస్ ను వీడి బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ ఇచ్చారు. శుక్రవారం గనుగులపల్లిలో అశ్వారావుపేట కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరంతా జారే ఆదినారాయణ గెలుపు కోసం పని చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నవారిలో సీతాయిగూడెం సర్పంచ్ కారం సుధీర్, డైరెక్టర్ అనుమాల సత్యనారాయణ, కమలాపురం ఉప సర్పంచ్ బాల అప్పారావు, రామచంద్రపురం సర్పంచ్ సున్నం సుధాకర్, చౌటిగూడెం సర్పంచ్ కీసరి శ్రీను, టిడిపి ఎంపిటిసిలు సున్నం సునీత, తాటి తులసి, ఇతర ప్రజాప్రతినిధులు వారి తదితరులున్నారు.



నిన్న కాంగ్రెస్... నేడు బీఆర్ఎస్

- తిరిగి సొంతగూటికి చేరుకున్న పీఏసీఎస్ చైర్మెన్ మెట్ల కృష్ణ

నవతెలంగాణ-ఇల్లందు

పీఏసీఎస్ చైర్మెన్ మెట్ల కృష్ణ బీఆర్ఎస్ పార్టీలో గత నాలుగేళ్లుగా పని చేశారు. ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయక్ సహకారంతో పిఎసిఎస్ చైర్మన్‌గా పదవి అలంకరించారు. కొంతకాలంగా పార్టీలో అసంతృప్తితో ఉన్న ఆయన ఎన్నికల సమయం దగ్గర పడుతున్నడంతో ఎమ్మెల్యే వర్గానికి పిఎసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ శాక్ ఇస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని కండువా కప్పుకున్నారు. ఒక్కరోజులోనే మనసు మార్చుకున్నారు. నేడు శుక్రవారం ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని హరిప్రియ నాయక్ సమక్షంలో తిరిగి గులాబీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

నాపై వచ్చేవి ఆరోపణలు మాత్రమే

- అవి రాజకీయ కక్ష సాధింపు చర్యలే
- మీకు సేవకుడిని అవుతా
- కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ

నవతెలంగాణ - అశ్వారావుపేట



గిరిజనేతర వ్యతిరేకిని అని నా పై కొందరు కక్ష సాధింపు చర్యల్లో కొందరు ఆరోపణలు చేస్తూ, అపోహలు సృష్టిస్తున్నారు. అవి అన్నీ రాజకీయ కక్ష సాధింపు లే తప్ప అందులో నిజం లేదని, నన్ను నమ్మండి ,నేను మీకు సేవకుడిని అవుతా అంటూ అశ్వారావుపేట కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ ఉద్వేగభరిత ఉపన్యాసం చేశారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి పోటీ చేశానని, నేడు కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్నానన్నారు. ఎఐసిసి నా పై ఎన్నో సర్వేలు చేసి నేను గెలుస్తానని నాకు కాంగ్రెస్ టికెట్ కేటాయించిందని తెలిపారు. తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించి నందుకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేణుకా చౌదరి,బట్టి విక్రమార్క కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసిన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన మిగిలిన పార్టీలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, బండి పుల్లారావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, బత్తిన పార్థసారథి, కే.పి ఇబ్రహీం పాల్గొన్నారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | నవంబర్ 11 2023 | www.navatelangana.com

గులాబీ జెండాయే అందరికీ అండ

- సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష
- సీఎం కేసీఆర్‌తోనే దేశ రాజకీయాలలో వెలుగులు
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- కాంగ్రెస్ పార్టీ నుంచి 30 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-బూర్గంపాడు

రాష్ట్రంలో ప్రతి గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, గులాబీ జెండాయే అందరికి అండ అని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం ఆయన సమక్షంలో



కృష్ణ సాగర్ గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 30 కుటుంబాలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి బిఆర్ఎస్ తప్పక రాణిస్తుందని అన్నారు. భవిష్యత్తులో దేశ్‌కి నేత సీఎం కేసీఆర్ కావడం ఖాయమని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ కట్టు బడి ఉన్నదని ఆయన తెలిపారు. ప్రజల ఆశీ స్సులతో సీఎంగా బాధ్యతలు చేపట్టి అనతి కాలం లోనే తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపారన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోతూ అభివృద్ధిలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో దూసుకుపోతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, సంక్షేమ పథకాల అమలు లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని మోస పూరిత నాయకుల మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని చెప్పారు. పక్ష నాయకులు ప్రభుత్వ పథకాలు సంక్షేమం చూసి తట్టుకోలే క పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి కొండారెడ్డి, ఉద్యమ నాయకులు పోడియం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పోటీ పడుతున్న సర్పంచ్

- నామినేషన్ దాఖలు చేసిన వెంకట ముత్యం
- స్వతంత్రుడుగా మొదలై బీసీవైపీ బీఫాం పై పోటీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

స్వతంత్రంగా ఎన్నికల సమరంలోకి దిగిన నారంవారిగూడెం సర్పంచ్ మనుగొండ వెంకట ముత్యం (పెద్దోడు) నామినేషన్‌లు స్వీకరణ చివరి రోజు శుక్రవారం భారత చైతన్య యువజన పార్టీ తరుపున నామినేషన్ దాఖలు చేసారు.

పేరు : మనుగొండ వెంకట ముత్యం
ఊరు : నారంవారిగూడెం
తండ్రి : వెంకటేష్
తల్లి : సీతమ్మ
భార్య : మహాలక్ష్మి
కూతురు : హరిణి పఊజ్రశఈ
వృత్తి : వ్యవసాయం,సర్పంచ్

తెలుగు దేశంలో రాజకీయ ప్రస్తానం ప్రారంభించిన వెంకట ముత్యం 2014లో భార్య



మహాలక్ష్మిని ఉమ్మడి నారంవారిగూడెం పంచాయతీకి సర్పంచ్‌గా గెలిపించారు. 2018లో పూర్వ నారంవారిగూడెంకు వెంకట ముత్యం సర్పంచ్‌గా విజయం సాధించారు. గత కొంత కాలంగా చిట్టితల్లి సేవా సంస్థ పేరుతో అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. పేదలకు ఆర్థిక సహాయం, క్షతగాత్రులకు, పలు రకాల రోగులకు అత్యావసర వైద్యం అందించడానికి గాను అంబులెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ఈ సేవలు నియోజక వర్గం వ్యాప్తంగా నిరాటంకంగా కొనసాగుతున్నాయి. గ్రామ పరిపాలనా అనుభవం, ప్రజలకు మరింత సేవలు చేయాలనే ధృడ సంకల్పంతో స్వతంత్ర అభ్యర్థిగా అశ్వారావుపేట నియోజక వర్గం ఎమ్మెల్యే గిరీ కోసం ప్రస్తుతం పడుతున్నారు.

ఖాతాదారుల నిబద్ధత వల్లే బ్యాంకు అభివృద్ధి

- సీనియర్ మేనేజర్ ప్రసాద్
- యూనియన్ బ్యాంక్ 105వ వార్షికోత్సవం
- పొగాకు సాగుదారులకు వ్యవసాయ రుణ పరిమితి పెంచాలి
- వినతి పత్రం అందించిన పొగాకు రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఖాతాదారులు వల్లే యూనియన్ బ్యాంకు అభివృద్ధి చెందుతుందని బ్యాంకు లాభాల్లో నడవడానికి వారి నిబద్ధతతో కూడిన లావాదేవీ లే కారణమని సీనియర్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంకు 105 వ వార్షికోత్సవాన్ని అశ్వారావుపేట శాఖ యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా ఖాతాదారులు తో సమావేశం నిర్వహించిన బ్యాంక్ అధికారులు సిబ్బంది అందిస్తున్న సేవలు ఖాతాదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ అశ్వారావుపేట బ్రాంచ్ రూ.200 కోట్లతో టర్నోవర్ జరుగుతుందని అందులో రూ.90 కోట్లు డిపాజిట్ కాగా రూ.110 కోట్లు రుణాల రూపంలో లావాదేవీలు నడుస్తున్నాయన్నారు. డిజిటల్ రంగంలో యూనియన్ బ్యాంకు మంచి ప్రగతి సాధిస్తుందని రాబోయే తరానికి ముందు



చూపుతో సేవలను సరళతరం చేస్తున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

పొగాకు రైతులకు రుణ పరిమితి పెంచాలి
పొగాకు రైతు సంఘం నాయకులు

ఈ ప్రాంతంలో ఎక్కువమంది పొగాకు సాగు చేస్తున్నారని వారికి గతంలో రూ.5 లక్షలు ఇచ్చేవారని ఇప్పుడు పక్క ప్రాంతంలో బ్రాంచ్ లలో రూ .7 లక్షలు చొప్పున రుణం ఇస్తున్నారని ఇక్కడ కూడా పొగాకు రైతులకు రుణ పరిమితి పెంచాలని రైతు సంఘం నాయకులు సీనియర్ మేనేజర్ ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కు వినతి పత్రం అందించారు. మీ వినతిని పరిగణలోకి తీసుకుంటామని తప్పకుండా మీకు రుణ పరిమితి పెంచే విషయంలో సహకరిస్తామని బ్యాంకు అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వేముల సూర్యప్రకాశరావు, సుంకవల్లి వీరభద్రరావు, గడ్డమణుగు సత్యనారాయణ, కొల్లు వెంకటరమణ, ముక్కు శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది మురళి, రాంబాబు, శ్రీధర్, హారిక, మనోహర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్‌ల పర్వం

- 23 మంది అభ్యర్థులు, 35 నామినేషన్ లు

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సాదారణ ఎన్నికల నామినేషన్‌లు స్వీకరణ పర్వం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు 14 మంది అభ్యర్థులు 17 నామినేషన్ లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి,అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు తెలిపారు. మొత్తం 23 మంది అభ్యర్ధులు 35 నామినేషన్ సెట్ దాఖలు అయ్యాయని అన్నారు. నామినేషన్ వేసిన వారిలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు(బీఆర్ఎస్), జారే ఆది నారాయణ(కాంగ్రెస్), పిట్టల అర్జున్(సిపిఐ(ఎం)), సున్నం నాగమణి (కాంగ్రెస్ రెబల్), ముయ్యబోయిన ఉమాదేవి(జనసేన), మనుగొండ వెంకట ముత్యం(బిసివైపి) ముఖ్యులుగా ఉన్నారు.

నాలుగోసారి నామినేషన్ వేసిన వెంకట నర్సయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

జయాపజయాలకు వెనుకాడకుండా నామినేషన్‌లు వేయడం అంటే కొందరికి అదో వ్యాపకం అనుకోవాల్సిందే. అశ్వారావుపేట నియోజక



వర్గం ఏర్పాటు అయిన 2009 నుండి ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లోనూ పోటీ కి సై అంటూ నాలుగో సారి ఎన్నికల బరిలో దిగుతున్న వెంకట నర్సయ్య పట్టుదల ప్రజాస్వామ్యానికి పెట్టుబడి లాంటిదే అని చెప్పక తప్పదు. ములకలపల్లికి చెందిన కన్నెబోయిన వెంకట నర్సయ్య గిరిజన తెగలో ఉప కులం నాయక పోడు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఈయన 2009, 2014 లో స్వతంత్రంగా పోటీ పడ్డారు. 2018, నేడు 2023 లో గోండ్వనా గణతంత్ర పార్టీ బీ.ఫాం పై పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా సామాజిక వర్గం రాజకీయ చైతన్యం చేయడం కోసం కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే ఓడిపోయినా తిరిగి నామినేషన్ వేస్తున్నామని, నన్ను నా సామాజిక వర్గం యువకులు కొందరు రాజకీయంగా క్రియాశీలంగా వ్యవహరిస్తూ నేడు నామినేషన్‌లు వేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీ, మున్సిపల్ చైర్మెన్‌లకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియూసీ నాయకుల సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం



కనకయ్య నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లకు, ఐఎన్టియూసీ సంఘ నాయకులు శాలువాలు పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ డా.శంకర్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు త్యాగరాజన్, కొత్తగూడెం బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్, ఇల్లందు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ లింగాల జగన్నాథం, జనరల్ సెక్రెటరీలు మహబూబ్, అన్వర్, పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియెలు, ప్రధాన కార్యదర్శి మహ్మద్ జాఫర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వరూప, వైస్ ప్రెసిడెంట్ చెంచమ్మ నాయకులు జీ.వీ.భద్రం, సుదర్శన్ కోరి, ఇబ్రహీం, ఈశ్వర్ గౌడ్, నిర్మలా, యూత్ కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మణ్, సుమిత్ కోరి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు భవ్యశ్రీ లక్ష్మి ఎంపిక

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఖమ్మం జిల్లా చెస్ అసోసియేషన్ వీ కింగ్స్ చెస్ అకాడమీ టోర్నమెంట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ వారి ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలం బి.గంగారం



లోని సాయి స్ఫూర్తి డిఎవి స్కూల్ ప్రాంగణంలో అండర్ 13 జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సాయి స్ఫూర్తి డి.ఎ.వి స్కూల్ విద్యార్థులు ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ తణుకు శేష సాయి శ్రీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో అశ్వారావుపేట కు చెందిన కేశిబోయిన భవ్యశ్రీ లక్ష్మి తృతీయ స్థానంలో నిలిచి బహుమతిని సాధించిందన్నారు. వీరు హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ లో పాల్గొంటున్నారని తెలిపారు.

పొదెం వీరయ్య సతీమణి ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచలం అసెంబ్లీ స్థానానికి ఈ నెల 30 వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న తాజా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణ



పొదెం పద్మ శుక్రవారం మండలంలోని పలు గ్రామాలల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆమె వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ నడికుడి కాళికాదేవి ఆలయం, దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుమ్ముగూడెం, ములకపాడు గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు తన భర్త వీరయ్యను ఆదరించి దీవించి హస్తం గుర్తు పై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. దుమ్ముగూడెంలో రహదారిపై ఉన్న హోటల్ వద్దకు వెళ్లి బజ్జీలు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు లంకా శ్రీనివాసరావు, నాయకులు బైరెడ్డి సీతారామారావుపిలకా వెంకటరమణారెడ్డి, లంకా శివ, సందీప్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పండాల సరిత, మహిళా కాంగ్రెస్ మండల అద్యక్షురాలు మద్ది కుమారి, వసీమ, హసీనా, రాంబాయి, వరలక్ష్మీ, అలివేలు, స్వరూప, రమణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

నవతెలంగాణ-మణుగూరు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని కూనవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మీరా హుస్సేన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు ఉపేందర్‌కు ఘన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి లక్ష్యాల కోసం ప్రతి విద్యార్థి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలన్నారు. దైనందిన జీవితంలో సైన్స్ పాత్ర తెలుసుకొని మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుడు ఉపేందర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు రఘునందన్ రావు, సింగం రవిబాబు, రేగా, వి.జయలక్ష్మి, వీరు, పాండురంగారావు, విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

12న అరుణాచలేశ్వరస్వామి ఆలయ షాపుల వేలం పాట

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నర్సాపురం గ్రామంలో గల చిన్నఅరుణాచలేశ్వరస్వామి వారి ఆలయ ముందు భాగంలో గల పూజా సామాగ్రికి సంబంధించిన రెండు షాపులను నిర్వహించుకునేందుకు వేలం పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసం ప్రారంభం నుండి మరలా కార్తీక మాసం వచ్చే వరకు ఏడాది పాటు శాశ్వత ప్రాతిపదికన పూజా సామాగ్రిని అమ్ముకోవచ్చాన్నారు. వేలం పాటు ఈ నెల 12 వ తేదీన ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు 8247259616, 9908229103 అనే ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు మాత్రమే వేలం పాటలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | నవంబర్ 11 2023 | www.navatelangana.com

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా జలగం నామినేషన్

- భారీగా హాజరైన కార్యకర్తలు

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు శుక్రవారం కొత్తగూడెం ఎన్నికల అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు తన నామినేషన్‌ను దాఖలు చేశారు. జాతీయ పార్టీ అయిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుండి ఆయన కొత్తగూడెం అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఫార్వడ్ బ్లాక్ పార్టీకి సింహం గుర్తు ఉంది. తొలుత ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తారని ప్రచారం సాగింది. కానీ ఆయన గుర్తింపు పొందిన జాతీయ పార్టీ నుండి నామినేషన్ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే గుర్తు కోసం ఇబ్బంది



పడాల్సి వస్తుందని, జాతీయ పార్టీ గుర్తు కోసం వేచి ఉండాల్సిన వచ్చిందిని సమాచారం. పార్టీ గుర్తు సింహాన్ని జలగంకు కేటాయించనున్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సంజయ్ నగర్‌లోని జలగం క్యాంప్ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున ప్రజలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతం జలగం రాకముందు జలగం ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ప్రస్తుతం ఎలా ఉందో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తను భవిష్యత్తులో ఏం చేస్తానో ప్రజలకు తెలియజేసి, వారికి నచ్చజెప్పి ఓట్లు అడుగుతానని, ఆ ధైర్యం తనకు ఉందన్నారు. తాను పనిచేశాను కాబట్టే తాను గుండె మీద చేయి వేసుకొని తాను చేసిన అభివృద్ధి గురించి ఓటర్లకు చెప్పగలనని ధీమా వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కాంగ్రెస్ పార్టీ నుండి చీలి ఏర్పడిన విషయం పాఠకులకు విధితమే.

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలిరండి

- ముమ్మరంగా ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

నవతెలంగాణ-బూర్గంపాడు

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. బూర్గం పాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఈనెల 13వ తేదీన జరగనున్న బిఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహణ ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించడానికి ప్రజల



సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు నియో జకవర్గంలోని ఏడు మండలాల నుంచి సుమారు 60 వేల మంది ఈ సభకు హాజరుతున్నట్లు ఆయన తెలిపారు. సభకు ప్రజలను మరింత ఉత్సాహ పరిచేదందుకుగాను గాయకుల బృందం హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, జిల్లా పార్టీ నాయకులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, సారపాక టౌన్ అధ్యక్షులు కొన కంచి శ్రీను, పార్టీ మండల నాయకులు చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎన్నికల పరిశీలనాధికారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు గాను మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను ఎన్నికల పరిశీలనా అధికారి (జనరల్ అబ్జర్వర్) ఎస్.గణేష్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా ఆయన మండల అధికారులతో కలసి భద్రాచలం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని తూరుబాక, నర్సాపురం, రేగుబల్లి, దుమ్ముగూడెం, బైరాగులపాడు



గ్రామాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ బూత్‌ల వద్ద వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, ఎస్సై పోటు గణేష్, దుమ్ముగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, సర్వేయర్ నర్సయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

- పాల్గొన్న మాజీ మండల అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్

నవతెలంగాణ-ములకలపల్లి

మలకలపల్లి మండలం పొగళ్లపల్లి పంచాయతీలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం శుక్రవారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి అశ్వరావుపేట ఎమ్మెల్యేగా మెచ్చా నాగేశ్వరరావు గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. ప్రజలలో ఎప్పుడు మమేకమై ఉన్న ఎమ్మెల్యేను మళ్లీ మనం గెలిపించుకోవాలని సౌమ్యుడు ప్రజల సమస్యల



పరిష్కారం కోసం పనిచేసే వ్యక్తిని గెలిపించుకోవాలని ఆయన అన్నారు. మండలంలో మెచ్చా ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి ఫలాలు అందాయని, కనుక కారు గుర్తుకు ఓటు వేసి మెచ్చాని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పుష్పాల చంద్రరావు, కొండవీటి రాజారావు, పుష్పాల సాయి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చింతగుప్ప గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని చింతగుప్ప గ్రామంలో శుక్రవారం పర్ణశాల ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఆయుర్వేద వైద్యాధికారి రాజేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి వివిద రకాల వ్యాధులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ఓ మెహబూబ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రింట్ మీడియా బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన బ్రోచర్‌ను ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తోకల మోహన్ రావు ఆవిష్కరించారు. బూర్గం పాడు ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కమిటీ సభ్యులు ప్రెస్‌క్లబ్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలను పత్రికల ద్వారా అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి నిరంతరం కృషి చేయాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ సభ్యులందరికీ దీపావళి గిఫ్ట్ ప్యాక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పండగ రాములు, ప్రధాన కార్యదర్శి వెంకన్న, కోశాధికారి జక్కిరెడ్డి మల్లారెడ్డి, ఉపా ధ్యక్షులు ఎం.వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బర్ల జోషి, ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు గుద్దేటి ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు వి.వి.బి.చారి, బండారు మహేష్, దుద్దుకూరు మురళి పాల్గొన్నారు.

గంటా రాధా ఆధ్వర్యంలో నిత్యాన్నదానం

నవతెలంగాణ-మణుగూరు

దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ గంట రాధా తెలిపారు. శుక్రవారం ఊటుకూరి కృష్ణారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ఊటుకూరు వెంకటేశ్వరరావు అన్నదానం కోసం ఆర్థిక సహాయం చేశారని గంట రాధా తెలిపారు. మణుగూరు, పినపాక, అశ్వాపురం మండలాల్లో వివిధ ప్రాంతాలలో ఆకలితో అలమటిస్తున్న



అనాధలకు, పేదలకు, వృద్ధులకు, మతిస్థిమితం లేని వారికి ఆహార పొట్లాలను అందించామన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో దానధర్మ ట్రస్ట్ సభ్యులు స్వయంగా సేవలు చేస్తూ ఆహార పదార్థాలు వండారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్యామల రజిని, చిరంజీవి, సంధ్య, లక్ష్మీ, స్వరూప, సరోజ, నాగమణి, రమణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మణుగూరు జడ్పీ కో ఎడ్యుకేషన్ విద్యార్థులు

నవతెలంగాణ-మణుగూరు

క్రికెట్ అండర్-17 బాలికల విభాగంలో పోలేబోయిన వైష్ణవి రత్న ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ సీనియర్స్ గర్ల్స్ కెప్టెన్‌గా ఎన్నికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ విభాగంలో పితాని దుర్గ భగవాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో ఎడ్యుకేషన్ మణుగూరు నుండి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు కోడి ఆదినారాయణ తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అమరవీరుల సభలు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలోని ఎలకలోడ్డు, రాంపురం, గుండ్లరేవు గ్రామాలలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అమరవీరుల సభలు జరిగాయి. ఈ సభలలో న్యూ డెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కె ఉమర్ జూలూరుపాడు, సబ్ డివిజన్ కార్యదర్శి వల్లోజీ రమేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మడి సీతారాములు, కలిగే వెంకటేశ్వర్లు, బచ్చుల నాగేశ్వరావు, మడి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గేమ్స్‌లలో మణుగూరు విద్యార్థి

నవతెలంగాన-మణుగూరు

తెలంగాణ స్టేట్ 67వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2023-2024 అండర్ ఏజ్ స్కూల్ గేమ్స్ ఫెడరైజేషన్ ఇండియా సర్టిఫికెట్ ఎలిజిబిలిటీ అండర్11,14,17, బాలురు, బాలికలలో అశ్వాపురం, మణుగూరు విద్యార్థి, విద్యార్థినీలు పాల్గొనగా ఇందులో స్టేట్ లెవెల్‌కు సెలెక్ట్ అయ్యారు. ఇందులో మణుగూరుకి చెందిన పూసలూరి కావ్య కొత్తగూడెం సింగరేణి జూనియర్ కాలేజ్, అశ్వాపురానికి చెందిన తోడేటి వైష్ణవి జడ్.పి.హెచ్.ఎస్ అశ్వాపురం 9వ తరగతి, చర్ల నరేంద్ర బాబు అశ్వాపురం ఎక్సెలెంట్ స్కూల్ 8వ తరగతి, మణుగూరుకి చెందిన పసుపులేటి నిక్షిత శ్రీ చైతన్య స్కూల్ ఆరవ తరగతి వీరంతా సీనియర్ కరాటే మాస్టర్ మురుగన్ వద్ద శిక్షణ పొందుతున్నారు. నేటి సమాజానికి కరాటే ఆడపిల్లలకు ఎంతో అవసరమని ఈ సందర్భంగా సీనియర్ కరాటే మాస్టర్ ఇలా అన్నారు.

12 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేషన్‌లు

నవతెలంగాణ-మణుగూరు

110 పినపాక నియోజకవర్గం శాసనసభ ఎన్నికలకు నామినేషన్ల చివరి తేదీ శుక్రవారం 12 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు ఒక సెట్టు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు రెండు సెట్లు, కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులుగా బట్ట విజయ్ గాంధీ, ఉకే ముద్దరాజ్ నామినేషన్లు దాఖలు చేశారు స్వతంత్ర అభ్యర్థులుగా ఆలయం నరేందర్ కుంజా కృష్ణారావు, భానోత్ జగ్గారావు, వర్ష శ్రీనివాస్, మాలోతు సువర్ణ తదితరులు నామినేషన్ వేశారు. బీఎస్పీ, బీజేపీ నుంచి నామినేషన్ వేసినట్టు తెలిపారు. నేటి వరకు 25 మంది అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో డెలివరీ కానీ వస్తువులు వేలం

- డిపో మేనేజర్ స్వామి

నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆర్టీసీ కార్గోలో డెలివరీ కానీ వస్తువులను గుర్తించి వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ టి.స్వామి శుక్రవారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ కార్గోలో వస్తువులను బుక్ చేసుకుని చాలాకాలంగా తీసుకెళ్లని వాటిని గుర్తించి ఈ నెల 14వ తేదీన మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు డిపో ఆవరణలో వేలం వేయడం జరుగుతుందన్నారు. తమ వస్తువులను కార్గోలో బుక్ చేసుకుని మరిచిపోయిన వారు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో డిపోలో సంప్రదించినట్టయితే వారి వస్తువులను గుర్తించే ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ఆసక్తి ఉన్నవారు ఈ వేలం పాటలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు.

టీడీపీది ఒకటే మాట ఒకటే భాట

నవతెలంగాణ-మణుగూరు

పినపాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీది ఒక్కటే మాట ఒకటే బాట అని ఓట్లను చీలిపోవకుండా ఐక్యంగా ఉండాలని పినపాక నియోజకవర్గం నాయకులు తెలిపారు. శుక్రవారం మణుగూరులో సీనియర్ నాయకులు వట్టం నారాయణదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య నాయకులు, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. మనం మద్దతిచ్చే పార్టీ అభ్యర్థి విజయానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, టీడీపీ రాష్ట్ర నాయకులు గల్లా నాగభూషయ్య, పార్లమెంటు నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, సమితి సింగారం సర్పంచ్ బచ్చల భారతి, గుండాల మండల అధ్యక్షులు తోలెం సాంబయ్య, కరకగూడెం మండల అధ్యక్షులు సిరిశెట్టి కమలాకర్, పినపాక మండల అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మండల అధ్యక్షులు తాళ్లూరు జగదీశ్వర్ రావు, అశ్వాపురం మండల అధ్యక్షులు తుళ్లూరు ప్రకాష్ రావు, మణుగూరు మండల అధ్యక్షులు దొడ్డి కృష్ణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మెచ్చా నాలుగో సెట్ నామినేషన్ దాఖలు చేసిన మోహన్ రెడ్డి

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట నియోజక వర్గానికి నామినేషన్‌లు స్వీకరణ ముగింపు రోజైన ఎనిమిదో రోజు శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు నాలుగో సెట్ నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డా.పి.రాంబాబు తెలిపారు. ఈ నామినేషన్ సెట్‌ను మెచ్చా నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడు మందపాటి మోహన్ రెడ్డి, ఆయన సమీప బంధువు అందజేసారు.



ప్రశ్నించే గొంతుకలను చట్టసభల్లోకి పంపించండి

- పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రశ్నించే గొంతుకులను చట్టసభల్లోకి పంపించాలని పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని కాచిరాజుగూడెం, వాల్యా తండా, కస్నాతండా, తనగంపాడు, పిట్టలవారి గూడెం, గూడూరుపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కొంతమంది డబ్బు సంచులతో ఓట్లు కొనేందుకు వస్తున్నారని, అటువంటి వారి వద్ద డబ్బు తీసుకొని నికార్సైన కమ్యూనిస్టులకు ఓటు వేయాలని కోరారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండటం ద్వారా చట్టసభలకు గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సీపీఎం ఇంచార్జ్ బండి రమేష్, ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, అద్దంకి తిరుమలయ్య, పొన్నం వెంకటరమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐదేండ్లకోసారి పారాషుట్ వేసుకుని రాను

- ప్రజల్లో ఉండేవాడిని... పిలిస్తే పలుకుతా
- ఈ గడ్డ వనమా అడ్డా
- బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- మీడియాతో సమావేశంలో తాతా మధు, వనమా



నవతెలంగాణ-కొత్తగూడెం

వనమా వెంకటేశ్వరరావు టూరిస్టు కాదు...! ఇక్కడే పుట్టాడు... ఇక్కడే పెరిగాడు... ఈ గడ్డ వనమా అడ్డా. ఐదు సంవత్సరాలకు ఓసారి పారాషుట్ వేసుకొని వచ్చేవాడు కాదు.... పిలిస్తే పలికే, ప్రజల్లో ఉండే కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ తాతా మధు, అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావులు నియోజకవర్గ ప్రజలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామం పత్రాలను దాఖలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే వారితో పాటు ఇతర పార్టీల వారు ప్రజలకు మాయమాటలు చెబుతూ మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వారి మాటలు నమ్మొద్దని ఓటర్లకు కోరారు. వనమా వెంకటేశ్వరరావు కారు గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేని అన్నారు. అటువంటి నాయకుడిని గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వనమాకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ చైర్ పర్సన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కోనేరు సత్యనారాయణ, లక్కినేని సత్యనారాయణ, తదితరులున్నారు.



కమ్యూనిస్టుల బలం నిరూపిద్దాం

- జిల్లాలో కమ్యూనిస్టుల పట్ల స్పందన కనపడుతోంది
- కేంద్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోంది
- సత్తుపల్లి అసెంబ్లీ సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి నామినేషన్ దాఖలు



నవతెలంగాణ-సత్తుపల్లి

నిత్యం ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టులను ఏనాటికైనా ప్రజలు గుర్తించేరోజు రాకపోదని, కమ్యూనిస్టుల బలం నిరూపించుకునే సమయం వచ్చిందని, జిల్లాలో కమ్యూనిస్టుల పట్ల స్పందన కనపడుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మన్నేపల్లి సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. సత్తుపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి నామినేషన్ సందర్భంగా స్థానిక ఎంఆర్ గార్డెన్‌లో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కమ్యూనిస్టు సిద్ధాంతం కచ్చితమని, ఊళ్లో ఒకరిద్దరు కమ్యూనిస్టులున్నా వారి లక్ష్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తారు తప్ప ప్రజలకు కీడుచేసే ఉదంతాలు మచ్చుకు కూడా మనకు కనపడవన్నారు. అంతిమంగా మన లక్ష్యం బీజేపీని అంతం చేయడమేనన్నారు. బీజేపీ దూకుడిని నిలువరించడానికే మునుగోడు ఎన్నికల్లో కమ్యూనిస్టులు బీఆర్ఎస్ జతకట్టక తప్పలేదన్నారు. ఒకవేళగనక మునుగోడులో బీజేపీ గెలిచుంటే దాని ప్రభావం దక్షిణ భారతంపై పడి ఉండేదన్నారు. ఇప్పుడు పార్టీలు మారిన వారంతా బీజేపీ పంచన చేరేవారన్నారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితి మరోలా ఉండేదన్నారు. బీజేపీ తెలంగాణలో అధికారం చేపడితే దేశం ఎలా నాశనం అయిందో ఇక్కడ కూడా అదే పరిస్థితి దాపురించేదన్నారు. ప్రమాదకరమైన బీజేపీ ప్రభావాన్ని తగ్గించడం కమ్యూనిస్టుల వల్లే సాధ్యపడిందన్నారు. తెలంగాణలో ప్రధాన పక్షంగా కాంగ్రెస్ ఎదగడంతో మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం బీఆర్ఎస్ బీజేపీతో జగకట్టిందన్నారు. మునుగోడులో గెలవగానే బీఆర్ఎస్‌కు మనతో అవసరం లేదని భావించిందన్నారు. కమ్యూనిస్టులను చులకనగా భావించారన్నారు. తక్కువ అంచన వేశారన్నారు. అందుకే ప్రస్తుత ఎన్నికల్లో మనసత్తా, మన బలాన్ని నిరూపించుకోవాలన్నారు. ఒక్కో కమ్యూనిస్టు సైనికుడిలా పనిచేసి మన అభ్యర్థి మాచర్ల భారతిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు.



కమ్యూనిస్టుల బలం నిరూపించుకొనే సమయం వచ్చింది : సత్తుపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి

కమ్యూనిస్టుల బలం ఏంటో నిరూపించుకొనే సమయం వచ్చిందని, మనల్ని చిన్నచూపు చూసిన వారికి మనవల్లే ఓడిపోయామని భావన కలిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాచర్ల భారతి అన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల ప్రజా సమస్యలపై మాట్లాడేవారు కరువయ్యారన్నారు. చట్టసభలు ప్రజా సమస్యలపై చర్చలు లేకుండా కేవలం తిట్టుకొనేందుకు మాత్రమే తయారయ్యాయని భారతి విమర్శించారు.

నామినేషన్ దాఖలు

సత్తుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా మాచర్ల భారతి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా సత్తుపల్లి ప్రధాన రహదారిపై భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఎంఆర్ గార్డెన్ నుంచి బస్టాండ్ మీదుగా రావి వీరవెంకయ్య భవన్ వరకు సాగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేశ్, తాతా భాస్కరరావు, జాజిరి శ్రీనివాస్, చలమాల విఠల్‌రావు, సీఐటీయూ జిల్లా నాయకులు మాచర్ల గోపాల్, సీనియర్ నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అర్వపల్లి గోపాలరావు, మాదాల వెంకటేశ్వరరావు, రావుల రాజబాబు, తన్నీరు కృష్ణార్జునరావు, అయినాల రామలింగేశ్వరరావు, గాయం తిరుపతిరావు, ఐద్వా నాయకురాళ్లు శీలం పకీరమ్మ, పాకలపాటి ఝాన్సీ, జాజిరి జ్యోతి, తన్నీరు కృష్ణవేణి, మెహరున్నీసాబేగం, మెరుగు రమణ, బేగం, అమరావతి, బీబీ, సుమతి పాల్గొన్నారు.

పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బోడ వెంకట్

నవతెలంగాణ - బోనకల్

వీర తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట అమరవీరుల పోరాట స్ఫూర్తితో సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయంతో ప్రారంభం కావాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బోడ వెంకట్, సిఐటియు జాతీయ కోశాధికారి మందడపు సాయిబాబు పిలుపునిచ్చారు. సిపిఎం మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్థూపానికి శుక్రవారం పూలమాలలో వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని గోవిందాపురం ఎల్ గ్రామం నుంచి ప్రారంభించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సభలో వెంకట్, సాయిబాబు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనాడు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువుగా ఉన్న గోవిందాపురం ఎల్, లక్ష్మీపురం గ్రామాలు ఉన్నాయన్నారు. అదే స్ఫూర్తితో పాలడుగు భాస్కర్ విజయం ప్రారంభం కావాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో గోవిందాపురం ఎల్ గ్రామ ప్రజలు పూర్వ వైభవం తీసుకురావాలని, అది పాలడుగు భాస్కరతో ప్రారంభం కావాలన్నారు. గోవిందపురం ఎల్ గ్రామం పోరాటాల పురిటి గడ్డ అన్నారు. కొంతమంది కాంగ్రెస్ గుండాలు సిపిఎం కార్యకర్త ఎర్రబోయిన



నాగేశ్వరరావుని అతి కిరాతకంగా హత్య చేశారని విమర్శించారు. ఎర్రబోయిన నాగేశ్వరరావుని హత్య చేసిన కాంగ్రెస్ గుండాలు ఎవరు మిగలరని, ఆ విధంగా పాలడుగు భాస్కర్ విజయానికి గోవిందాపురం గ్రామస్తులందరూ కృషి చేయాలని కోరారు. మధిర నియోజకవర్గానికి నామినేషన్ వేసిన బూర్జువా పార్టీల నాయకులు దేవాలయాలలో పూజలు చేసి నామినేషన్లు దాఖలు చేశారన్నారు. కాని పాలడుగు భాస్కర్ మాత్రం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నామినేషన్ దాఖలు చేస్తున్నారన్నారు. పాలడుగు భాస్కర్ విజయం కోసం ప్రతి ఒక్కరూ ఈ 20 రోజులు నిర్విరామంగా కృషి చేసి గోవిందాపురం ఎల్ గ్రామం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం అమరవీరుల స్తూపం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సిపిఎం గోవిందపురం ఎల్ గ్రామ సీనియర్ నాయకులు 30 సంవత్సరాలపాటు ఏకధాటిగా, వరుసగా సర్పంచిగా పనిచేసిన మాదినేని నారాయణ ఇంటికి పాలడుగు భాస్కర్ వెళ్లారు. ఈ సందర్భంగా మాదినేని నారాయణ పాలడుగు భాస్కర్‌కు పూలమాలవేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాదినేని నారాయణ పాలడుగు భాస్కర్‌ను ఆశీర్వదించారు. విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ఈ ఎన్నికలలో భాస్కర్ విజయం సాధించాలని తాను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ గూండాల దాడిలో ఇటీవల మృతి చెందిన ఎర్రబోయిన నాగేశ్వరరావు ఇంటికి వెళ్లారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావు భార్యా పిల్లలు ఉషారాణి, సురేందర్, రమ్య, తల్లిదండ్రులు కళావతి, కృష్ణలను పరామర్శించారు. వారిని ఓదార్చి మీకు సిపిఎం నిత్యం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని నారాయణ, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సిపిఎం నాయకులు ఏడునూతల లక్ష్మణరావు, కళ్యాణపు శ్రీనివాసరావు, కళ్యాణపు బుచ్చియ్య, కోట కాటయ్య, వల్లంకొండ సురేష్, పుచ్చకాయల వలరాజు, పొన్నం రాంబాబు, బండి చందర్రావు, కారంగుల చంద్రయ్య, కొమ్ము కమలమ్మ, కారంగుల లక్ష్మణ్, తమారపు లక్ష్మణ్, నల్లమోతు నాగేశ్వరరావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పసుపులేటి నరేష్, పసుపులేటి హనుమంతరావు, నల్లమోతు వాణి తదితరులు పాల్గొన్నారు.

c m y k

దేశాన్ని అత్యున్నత స్థానంలో ఉంచిన పార్టీ కాంగ్రెస్

- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

దేశాన్ని అత్యున్నత స్థానంలో ఉంచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని 9, 10 డివిజన్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియమ్మను మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దని ఆరోపించారు. నలభై సంవత్సరాల రాజకీయ జీవితంలో నేను ఎవరిని బెదిరించింది లేదని, కానీ ఈనాడు ఖమ్మంలో అడుగడుగునా బెదిరింపులు, భూ కబ్జాలు, చివరకి గంజాయి మాఫియాను కూడా తయారు చేసిన నీచమైన రాజకీయాలకు తెగబడ్డారని, డాక్టర్ల భూములను నుండి మొదలు సామాన్యులు భూములను, ఆఖరికి శ్మశానాలను కూడా వదిలి



పెట్టకుండా కబ్జాలు చేసిన దుర్మార్గులను ఖమ్మం పట్టణం మీదకు వదిలి సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నారన్నారు. గురువారం అయనేదో ప్రగల్భాలు పలుకుతున్నాడు.. పాలేరులో చెల్లని రూపాయి ఖమ్మంలో చెల్లుతుందా అని నువ్వు చెల్లని రెండువేల రూపాయల నోట్ లాంటోడివని, నేను డాలర్ లాంటోన్ని ఏ దేశం పోయినా చెల్లుతుందని, ఈ జిల్లాల్లో ఎక్కడ నుండైనా పోటీ చేసి గెలిచే సత్తా నాకుందని, నువ్వు మాత్రం ఖమ్మం దాటితే ఎవడివో ఎవరికి తెలియదన్నారు. నేనెక్కడ నీలాగా కుల సంఘాల్లో, మత సంఘాల్లో వేలుపెట్టి వారిని విడగొట్టి పాలించిన చరిత్ర నాకు లేదని తెలిపారు. అంతే కాకుండా నేను ఎక్కడ పోటీ చేసి గెలిచిన ఖమ్మం నగరాన్ని మరిచి పోలేదని, ఖమ్మం నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రవేశ పెట్టిన ఎన్నికల మేనీపేస్టోలోని అరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావేద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మానుకొండ రాధా కిషోర్, 9, 10 డివిజన్ల కార్పొరేటర్లు చావా నారాయణరావు, జాన్ భీ నాగులుమీరా తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎంపీడీవో అశోక్ కుమార్

నవతెలంగాణ-ముదిగొండ

ఓటు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి విడివి అశోక్‌కుమార్ అన్నారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మేడేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగించుకునే ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకూడదన్నారు. భావిభారత విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులు, నిరక్షరాస్యులను చైతన్య పరచాలన్నారు. సి.విజిల్ యాప్ ద్వారా ఏదైనా డబ్బు, మద్యం పంపిణీ చేసినచో ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై సి విజిల్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ పి.సూర్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పి.సంపత్, ఎండి.సాహెబ్ అలీ, మేడేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం బండి నాగేశ్వరరావు, గ్రామపంచాయతీల బిఎల్ఓలు, ఆశా కార్యకర్తలు, ఐకెపి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతాం

- సంభాని వర్గీయులు స్పష్టీకరణ

నవతెలంగాణ-కల్లూరు

ఎన్నో పదవులను అనుభవించి టిక్కెట్ ఇవ్వకుండా అవమానపరిచారు అంటూ కాంగ్రెస్ పార్టీ వదిలి బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ వెంట వెళ్ళేది లేదని, తాము పార్టీ మారే ప్రసక్తే లేదని స్తంభాన్ని వర్గీయులు స్పష్టం చేశారు. శుక్రవారం లక్కినేని రమేష్ గృహంలో సమావేశమై సంపాది వర్గం వర్గీయులు నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మట్టా రాగమయని గెలిపిస్తామంటూ కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్‌కి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడారు. అందరు సహకారం ఉంటుందని పార్టీ టికెట్ తెచ్చుకున్నామని అందర్నీ కలుపుకొని పోయి విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, మాజీ ఆత్మ చైర్మన్ నున్న రామకృష్ణ, నారాయణం వరపు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, భాగం ప్రభాకర్ రావు, జిల్లెల కృష్ణారెడ్డి, యాకూబ్ అలీ, లచ్చి నేను రమేష్, ఎస్‌కే.బాజీ, జినుగు భాస్కరరావు, రాజు, భూక్య శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నేరెళ్ల విశ్వనాథం మృతి

తల్లాడ : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, మేజర్ గ్రామ పంచాయతీ తల్లాడ మాజీ సర్పంచ్ నేరెళ్ల విశ్వనాథం (88) శుక్రవారం హైదరాబాద్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధునిగా, తల్లాడ మేజర్ జీపీ సర్పంచ్‌గా తల్లాడ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి ప్రజా మన్ననలు పొందారు. ఆయన మృతితో తల్లాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు.

బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన శృతి

నవతెలంగాణ-కొణిజర్ల

అండర్17 బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయికి మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోవ తరగతి చదువుతున్న ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని సవళ్ల శృతి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి సెలక్షన్స్‌లో అండర్/17 బ్యాడ్మింటన్‌లో (షటిల్) రాష్ట్రస్థాయికి ఎంపికైదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే .మార్క్ తెలిపారు. సవళ్ళ శృతి బాగా ఆడి బ్యాడ్మింటన్ రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికవౌడంతో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ రంజాన్ అభినందనలు తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలు హైదరాబాద్ జిల్లాలో జరుగుతాయని, రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ లో రాణించాలని అకాక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు అంతా శృతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీఎల్ నరసింహారావు, కటారు శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, షేక్ ఇస్మాయిల్, జిడిఎస్వి రమణ, , శ్రీధర్ బాబు, జే.రవి, సాంబచారి ,వెంకటేశ్వర్లు , పూర్ణచంద్రరావు, రాంబాబు, ఎస్ అంజనాదేవి, ఎన్. శైలజ, కే .భాగ్యలక్ష్మి, సునీతరాణి ,మైబు తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

మధిర : సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాతీయస్థాయి నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్) ప్రవేశ పరీక్షలలో మధిర శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో రెండో స్థాయి పరీక్షకు 57 మంది విద్యార్థులు అర్హత సాధించారు. సబ్జెక్టుల వారీగా మాథ్స్ 17, ఫిజిక్స్ 18, కెమిస్ట్రీ 22 మంది విద్యార్థులు అర్హత సాధించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ ఆకెళ్ళ భారతి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులను సైతం ఇటువంటి జాతీయ స్థాయి పరీక్షలలో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతూ అర్హత సాధించేలా వారిలోని నైపుణ్యాలను వెలికి తీయటానికి అవసరమైన శ్రీ చైతన్య స్కూల్ కర్కులం గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులను ఎంతగానో కొనియాడారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీధర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ ఎంవి కృష్ణారావు, డీన్ నరేష్, గూడెల్లి సి బ్యాచ్ ఇంచార్జ్ కోట చిన్న తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత సమావేశం

ఎర్రుపాలెం : త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షుడు, రాజుపాలెం ఎంపీటీసీ దోమందుల సామేలు ఆధ్వర్యంలో జమలాపురం గ్రా మంలో గల వాసిరెడ్డి కళ్యాణ మండపం నందు శుక్రవా రం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయక పోవడం వలన మ ధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండల తెలుగుదేశం పార్టీ ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే దానిపై విస్తృతంగా చర్చించారు. తెలుగుదేశం పార్టీకి ఏ పార్టీ వారు సముచితమైన గౌరవం,కార్యకర్తల అవసరాలను గుర్తించి పని చేస్తారో ఆ పార్టీ కి మద్దతు ఇచ్చేందుకు ఏక గ్రీవ తీర్మానం చేశారు. ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది మరొకసారి మండల పార్టీ సమావేశం జరుపుకొని కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సామినేని రామారావు, గూడూరు వెంకటేశ్వర్ రెడ్డి,గురజాల సత్యనారాయణ, అయ్యవారిగూడెం సర్పంచ్ గోసు రామారావు, బండారు అప్పారావు, వంకాయలపాటి జగన్,ఎర్రమల కిషోర్ రెడ్డి, చాట్ల బాబురావు, వరికోటి రవి, శీలం నాగిరెడ్డి, జవ్వాజి భాస్కర్ రావు, వేముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండే పోటుతో ముత్తయ్య మృతి

కామేపల్లి : కామేపల్లి మండలం తాళ్ల గూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ కార్యకర్త చిప్పలపల్లి ముత్తయ్య(50) గుండెపోటుతో మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి గోపాల్‌రెడ్డి ముత్తయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, జగదీష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లకావతు. సునీత మంగీలాల్, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, ఉపసర్పంచ్ పుచ్చకాయల సత్యనారాయణ, ఓబిసిసి జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఐదు కేజీల గంజాయి పట్టివేత

మధిర : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఖమ్మం వారి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎం.ప్రసాద్ నేతృత్వంలో విశ్వసనీయ సమాచారం మేరకు మధిర రైల్వే స్టేషన్, రైల్వే ట్రాక్ పరిసరాలలో అనుమానాస్పద ప్రాంతాలలో చేసిన తనిఖీలలో 5 కేజీల ఎండు గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయికి సంబంధిత వ్యక్తులు ఎవరూ దొరకలేదు. ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎం.ప్రసాద్ తెలిపారు. ఈ దాడులలో ఎస్సైలు జి.చంద్రశేఖర్, ఎం. శార్వాణి,కానిస్టేబుల్స్ సిహెచ్ గోపి, షేక్ రియాజ్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

దేవాలయం మంత్రి ప్రత్యేక పూజలు

ఖమ్మం : బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ కార్యక్రమానికి వెళ్తూ వివిధ దేవాలయాల్లో నామినేషన్ పత్రాలకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజ నిర్వహించారు. శుక్రవారం ఖమ్మంలోని వీడియోస్ కాలనీలో శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయం, ఎన్ఎస్పీ క్యాంపులోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారి దేవాలయం, ఎన్ఎస్టీ రోడ్ లోని స్తంబాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, త్రీ టౌన్ లోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయం, తుమ్మలగడ్డలోని శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-వైరా

వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ శుక్రవారం తన రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు చివరి రోజైన శుక్రవారం నియోజకవర్గం నుండి తరలించిన కార్యకర్తలు అభిమానులతో కాంగ్రెస్ కార్యాలయం నుండి మధిర క్రాస్ రోడ్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం రిటర్నింగ్ అధికారి సత్య ప్రసాద్ కు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, దాసరి దానేలు, రాంపుడి రోశయ్య, మచ్చా వేంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తల్లాడ : మిట్టపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు, నూతనకల్, వెంకన్నపేట, రంగం బంజర, నారాయణ బంజర, మల్సూర్ తండా, రామానుజవరం, లక్ష్మీపురం, పినపాక, వెంకటాపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారుల సహకరించాలని ఏఈ సుందర్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

సులేమాన్ ఖాన్ పరామర్శించిన ఎమ్మెల్యే

కల్లూరు : పట్నంలోని ముస్లిం పెద్ద సీనియర్ నాయకులు సులేమాన్ ఖాన్‌ని బీఆర్ఎస్ సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆరోగ్య, యోగ క్షేమాలు తెలుసుకొన్నారు.



ఎన్నికల్లో పోటీ చేస్తున్న మీ ఆశీస్సులు తెలిపి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయనతోపాటు జడ్పిటిసి కట్టా అజయ్‌కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే.కమ్లి, ఇసాక్, తదితరులు ఉన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు తులిస్య మృతి

రఘునాథపాలెం : సిపిఐ సీనియర్ నాయకులు, గణేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి బానోత్ తులిస్య నాయక్ (75) శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆయన స్వగృహంలో ఉంచిన మృత దేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తులిస్య నాయక్ తుదిశ్వాస వరకు పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. తులిస్య మృతదేహానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాస్, నాయకులు బాగం ప్రసాద్, జోగు పుల్లయ్య, బానోత్ లక్ష్మ, బానోత్ శివ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సత్తుపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి...

ఎన్నికల ఖర్చుకు దాతలు రూ.1.30లక్షల వితరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి ఎన్నికల ఖర్చుకు ఆ పార్టీకి చెందిన దాతల నుంచి విశేష స్పదన వస్తోంది. మండలంలోని తాళ్లమడకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రైతుసంఘం మండల అధ్యక్షుడు బాల బుచ్చయ్య రూ. 50వేలు వితరణ చేశారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు రాయల రామారావు రూ. 50వేలు అందించారు. సత్తుపల్లి ప్రాంతంలో సీపీఐ(ఎం) నిర్మాణంలో కీలక భూమిక పోషించిన పార్టీ సీనియర్ నాయకులు దివంగత పాకలపాటి వసంతరావు కుమారుడు మల్లికార్జునరావు రూ. 25వేలు, యూటీఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు శరత్‌బాబు రూ. 5వేలు అందించారు. ఈ మొత్తాన్ని పార్టీ అభ్యర్థి మాచర్ల భారతికి అందించారు. కార్యక్రమంలో ఈ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు మన్నేపల్లి సుబ్బారావు, మాదినేని రమేశ్, మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, చలమాల విఠల్‌రావు, రావుల రాజబాబు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, సీపీఐ(ఎం) జిల్లా నాయకురాలు బుగ్గవీటి సరళ పాల్గొన్నారు.



అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించండి

- సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాగమయి దయానంద్

- రామానగరం నుంచి ప్రచారాన్ని ప్రారంభించిన డాక్టర్ దంపతులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ సత్తుపల్లి అభ్యర్థి డాక్టర్ రాగమయి దయానంద్ ప్రజలను కోరారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిపించకున్న డాక్టర్ దంపతులు తమ ప్రచారాన్ని మండలంలోని రామానగరం నుంచి ప్రారంభించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించుకుంటూ రాగమయి ప్రచారం నిర్వహించారు. రామానగరం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రచారం గంగారం, ప్రకాశ్‌నగర్, రామగోవిందాపురం, మేడిశెట్టివారిపాలెం, సత్యనారాయణపురం, పాకలగూడెం, బేతుపల్లితో ముగిసింది. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులకు తోడుగా సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం భజ్యాతండా,మధురానగర్‌కు చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఖమ్మంలో బానోత్ మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరిన వారికి బానోత్ మదన్‌లాల్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం ఫలికారు. ఈసందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ తనను నమ్మి వచ్చిన వారికి ఎలాంటి అపద వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. తన ధ్యాస నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో భూక్యా మోతీలాల్, అజ్మీర రవి, జల్య, భద్రు, నాగేశ్వరరావు, కోటి ఉండగా ఈ కార్యక్రమంలో హన్మకొండ రమేష్, భూక్యా మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో 14న కిసాన్ మేళా

నవతెలంగాణ-వైరా

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వైరా ఆధ్వర్యంలో వైరా కెవికెలో ఈ నెల 14న కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిలో యాజమాన్య పద్ధతులు, వరికి ప్రత్యామ్నాయంగా యాసంగిలో సాగు చేసుకునే పంటలు, మరియు వివిధ పంటలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నూతన పద్ధతులు, సాంకేతికతపై రైతుల సందర్శన కోసం వివిధ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపుతూ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు త్రివేణి విద్యార్థులు

నవతెలంగాణ- ఖమ్మం

ఎస్‌జీఎఫ్ అండర్ 14 షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో త్రివేణి పాఠశాలకు చెందిన బి.విశ్వతేజ ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో మొదటి స్థానంలోనూ ఏ.వినయ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో రెండవ స్థానంలోనూ నిలిచారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎస్ జి ఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి ఎంపికల్లో విద్యార్థులు పాల్గొని ఈ విజయాన్ని సాధించారని తెలిపారు. విద్యార్థులను అభినందించి రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్నింట ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ,సందీప్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలేరులో చివరి రోజు 22 నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పాలేరు నియోజకవర్గంలో చివరి రోజు శుక్రవారం 19 మంది అభ్యర్థులు 22 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి రెండు సెట్లు, సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం, బిజెపి అభ్యర్థి నున్నా రవికుమార్, బీస్పీ అభ్యర్థి అల్లిక వెంకటేశ్వరరావు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి హలావత్ రామారావు, భారతీయ స్వదేశి కాంగ్రెస్ పార్టీ నుంచి తేజావత్ బాలకృష్ణ, మన టీఆర్ఎస్ పార్టీ నుంచి పంబ సూర్యనారాయణ,ఎంసీపీఐ (యునైటెడ్) వెంకటేశ్వర్లు కాంపాటి, దళిత బహుజన పార్టీ నుంచి ప్రసాద్ కొమ్ము, ప్రజావాణి పార్టీ నుంచి దులం వెంకట్ నారాయణ నామినేషన్ దాఖలు చేయగా, స్వతంత్ర్య అభ్యర్థులు: కందాళ విజయ, అనుగంటి నాగరాణి, గోపోజు రమేశ్ (రెండు సెట్లు), శ్రీనివాస్ అన్నబత్తుల, గడ్డం వీరబాబు, భారీ అశోక్, పసుమర్తి శ్రీనివాస్, రామసహాయం మాధవిరెడ్డి, భూక్య పార్వతి (రెండు సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు.

కేసీఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన భూక్యా రామచంద్రనాయక్

నవతెలంగాణ- కామేపల్లి

ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అసమతి నేత భూక్యా. రామ్ చందర్ నాయక్ సీఎం కేసీఆర్ సమక్షంలో హైదరాబాద్ లో చేరినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం 30 సంవత్సరాలుగా కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని మోసిన తమకు చివరి వరకు సరైన గౌరవం దక్కకపోవడంతో విరక్తి చెందడం,బిఆర్ ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆకర్షితమై ప్రజలకు మరిన్ని సేవలు, సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో చేరడం జరిగిందన్నారు. ఇల్లందుర్ నియోజకవర్గంలో ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీకి అండగా ఉండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హరిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కంకణం కట్టుకొని పనిచేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

యాదవ, కురుమలను మోసం చేసిన కేసీఆర్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తెలంగాణ రాష్ట్రంలో యాదవ, కురుమలను నమ్మించి మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ఓడించాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. ఈనెల 11వ తేదీన కూసుమంచిలో నిర్వహించనున్న యాదవ,కురుమల ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికై మండల పరిధిలోని తల్లంపాడులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిబాబుయాదవ్ మాట్లాడారు.2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. గతంలో యాదవ, కురుమల సమస్యల పరిష్కారానికై ఫెడరేషన్ ఏర్పాటు చేసి గుర్తింపు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీని బలపరచాలన్నారు. పాలేరులో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సోమబోయిన లింగయ్య, రామ్మూర్తి, సత్యనారాయణ, తిరుపయ్య, విజయ్ కుమార్, వలరాజు, సూర్యనారాయణ, లింగయ్య, అచ్యుతరావు, శ్రీనివాసరావు, చందు, నాగేశ్వరరావు, గణేశ్, సాయి పాల్గొన్నారు.

విజయలో ముగిసిన రోబోటిక్స్ వర్క్‌షాప్

నవతెలంగాణ-కొణిజర్ల

స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో అటానమస్ రోబోటిక్ వెహికల్స్ అప్లికేషన్స్ అనే అంశంపై డిపార్ట్మెంట్ ఆఫ్ ఈసిఈ కిట్స్ కార్ట్ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఫైర్ సేఫ్టీ, చంద్రయాన్ మిషన్, అడ్వాన్స్ ఏటీఎం, క్రాప్ ప్రొడక్షన్, కార్ సేఫ్టీ, కెమెరా రోబో వివిధ రకాలైన రోబో నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆయేషా తరుణం మాట్లాడుతూ కార్యక్రమంలో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని రోబో నమూనాలను తయారుచేసి ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. అదే విధంగా డిపార్ట్మెంట్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవకాశం కల్పించిన మేనేజ్మెంట్, ఇతరులకు ముఖ్యంగా కిట్స్ కార్ట్ రిసోర్స్ పర్సన్ జి.సూర్యని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి చిన్నయ, ఎకడమిక్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ధరావత్ రామ్మూర్తి నాయక్ నామినేషన్

నవతెలంగాణ-వైరా

వైరా ఎస్‌టి నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి చివరి వరకు ప్రయత్నించినా ఫలితం దక్కని ధారావత్ రామ్మూర్తి నాయక్ శుక్రవారం చివరి నిమిషంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా విలేఖరులతో రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ, నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, కష్ట పడిన తనకే టిక్కెట్ వస్తుందని ఆశపడినట్లు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లేదని రుజువు అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం ప్రజల కోరిక మేరకే స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో నిలుస్తున్నట్లు వివరించారు.

సత్తుపల్లిలో కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు

నవతెలంగాణ- కల్లూరు

ఈ నెల 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మట్ట రాగమయ గెలుపు కోసం తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కాకర్ల రంగారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మ్యాంగో మార్కెట్ ఆవరణలో సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల కమిటీ అధ్యక్షుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థికి సంపూర్ణ సహకార అందించి గెలిపించారని, అదే స్ఫూర్తితో ఈసారి కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వారు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ అందర్నీ కలుపుకొని అందరి కృషితోనే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం అన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, జిల్లెల కృష్ణారెడ్డి, తెలుగుదేశం మండల కమిటీ అధ్యక్షుడు బానో చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, విజయదాసుతో పాటు నాలుగు మండలాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పనితీరుపై సీడీపీవో ఆగ్రహం

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సీడీపీవో

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో కొత్తూరుతండా అంగన్‌వాడీల పనితీరుపై ఐసీడీఎస్ కామేపల్లి ప్రాజెక్టు సీడీపీవో దయామణి అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తూరుతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలందరికి హాజరు వేయగా, కేంద్రంలో పిల్లలు లేక పోవటంపై టీచర్‌పై అగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులలో గర్బిణీలు, బాలింతలు రాకున్న వాళ్లకు రేషన్ తీసింది. సరుకులలో వ్యతాసాలను సీడీపీవో పరిశీలనలో తేలాయి. రికార్డు ప్రకారం గ్రుడ్లు 77 ఉండాల్సి ఉండగా 109, పాలు 7.800 లీటర్లు ఉండాల్సి ఉండగా 11 లీటర్లు ఉన్నాయి. అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ రిజిస్టర్ 6 నెలలలుగా రాయటం లేదు. యూనిఫాం ధరించాల్సి ఉండగా వేసుకోకుండా విధులకు హాజరుతుందని, అంగన్‌వాడి ఆయాకు బదులుగా ఆమె కూతురు హాజరవ్వటం, కేంద్రంలో స్టాక్ ఎక్కువ ఉన్న దానిపై అంగన్‌వాడీ టీచర్ సరైన సమాధానం చెప్పక పోవటంపై అగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ వైజర్ల తనిఖీల సమయంలో స్టాక్ హెచ్చుతగ్గులు గుర్తించక పోవటంపై వారిని బాధ్యులను చేయటం జరుగుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల తనిఖీల పోటోలను కార్యాలయ అంతరంగిక వాట్సప్ గ్రూపులో పెట్టాలని ఆదేశించారు.

ప్రపంచంలో మనదేశం అగ్రగామిగా ఉందంటే కారణం యువతే

ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

ప్రపంచంలో మన దేశం అగ్రగామిగా ఉందంటే కారణం యువతే అని ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ యువం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువతకు గత పదేళ్లలో అన్యాయం జరిగిందని తెలిపారు. యువత నోట్లో మన్ను కొట్టారు....ఆ మన్ను మీరు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కొట్టాలని పిలుపునిచ్చారు.

సామాన్యులకు సైతం హైదరాబాద్ తరహాలో వైద్యం

ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ -ఖమ్మం

ఖమ్మంలో సామాన్యులకు సైతం హైదరాబాద్ తరహాలో వైద్యం అందుతుందని ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని 44వ డివిజన్ లో సృజన ఆసుపత్రి, పిఎన్ఎస్వీ హాస్పిటల్ సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో అయన మాట్లాడారు. ఖమ్మం వైద్య రంగంలో చాలా ముందుకు వెళ్తుందని ఒకప్పటితో పోల్చితే నేడు పేదలకు వైద్యం అద్భుతంగా అందుతుందన్నారు. సామాన్యులకు సైతం హైదరాబాద్ తరహాలో అన్ని సూపర్ స్పెషాలిటీ స్థాయి చికిత్సలు అందుబాటులోకి తేవడానికి నేను చేసిన కృషి మీకు తెలుసునని అన్నారు. ఖమ్మం మరింత అభివృద్ధి కావాలని అంటే మళ్ళీ బిఆర్ఎస్ ప్రభుత్వం ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నానని అన్నారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ పిఎన్ఎస్వీ ప్రసాద్ , డాక్టర్ గురునాథ్ రావు , డాక్టర్ సంధ్యా రాణి, డాక్టర్ లక్ష్మణ్, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికలలో సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాలడుగు భాస్కర్ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మీనవోలు గ్రామం నుండి సిపిఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పార్టీ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.